


# సూర్య రేఖ
తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 104 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | గురువారం 17 అక్టోబర్ 2024 | వెల : 4/-



## ఏపీలో రిపోర్ట్ చేయాల్సిందే

- ఏపీ, తెలంగాణ ఐఏఎస్ అధికారులకు హైకోర్టులో చుక్కెదురు
- తమను రిలీవ్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని ఐఏఎస్ అధికారుల పిటిషన్
- ముందు మీరు డీవోపీటీ కేటాయించిన రాష్ట్రాల్లో చేరాలని హైకోర్టు ఆదేశం
- మీరు ఎక్కడ పని చేయాలో కేంద్రం నిర్ణయిస్తుందన్న హైకోర్టు
- వాదనలు విని... ఐఏఎస్ అధికారుల పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

-2లో



## సమగ్ర కులగణనకు కసరత్తు!



- ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు..
- ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ క్రతువును రెండు నెలల్లో పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది
- ఈ దిశగా మూడు జిల్లాల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని కార్యోన్ముఖులను చేస్తున్నారు
- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత భారాస ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది

హైదరాబాద్

సమగ్ర కులగణన చేపట్టేందుకు జిల్లాల అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు వెలువడనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ క్రతువును రెండు నెలల్లో పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది. ఈ దిశగా మూడు జిల్లాల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని కార్యోన్ముఖులను చేస్తున్నారు. తెలంగాణ - మిగతా3లో



## జమ్ముకశ్మీర్‌లో భారీ అగ్నిప్రమాదం

- 68 ఇళ్లు దగ్ధం
- ఇళ్లు కాలిపోవడంతో నివాసితులు రోడ్డు పాలయ్యారు.
- అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారికి తాత్కాలిక టెంట్లలో ఆశ్రయం
- బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయంతోపాటు పునరావాసాన్ని కల్పించే చర్యలు


# ఇందిరమ్మ కమిటీలతో పార్టీ బలోపేతం

- కాస్త ఆలస్యమైనా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటును ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నా సీఎం
- పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి ఇందిరమ్మ కమిటీలను ఓ అవకాశంగా ఉపయోగించుకోవాలని నిర్ణయం
- గ్రామాలన్నింటిపై ఇందిరమ్మ కమిటీల ప్రభావం ఉండేలా ప్రణాళిక
- ప్రభుత్వ ప్రతి పథకం ప్రజలకు ఇందిరమ్మ కమిటీల ద్వారానే చేరుతుందని ప్రభుత్వం యోచన



హైదరాబాద్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాలన ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి ఇందిరమ్మ కమిటీలను ఓ అవకాశంగా ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. కాస్త ఆలస్యమైనా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటును ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల నాటికి గ్రామాలన్నింటిపై ఇందిరమ్మ కమిటీల ప్రభావం ఉండేలా చూసుకోనున్నారు. అంటే.. ప్రతి ప్రభుత్వ లబ్ధిదారుడు కాంగ్రెస్ ను దాటిపోడు. అంతే కాదు ఇతర కాంగ్రెస్ సంప్రదాయ ఓటర్లనూ చేజారిపోకుండా చూసుకోవచ్చు. - మిగతా3లో



## ఏక్‌నాథ్ షిండేనే మహాయుతి సీఎం అభ్యర్థి

- సీఎం ఎవరో సంకేతాలిచ్చిన దేవేంద్ర ఫడ్నవిస్
- “సీఎం అభ్యర్థిని ప్రకటించాల్సిన పని మాకు లేదు
- మా ముఖ్యమంత్రి ఇక్కడే కూర్చున్నారు
- ఎలాగూ అధికారంలోకి రామని తెలిసే సీఎం అభ్యర్థిని ఎంవీఏ ప్రకటించడం లేదు

### తెలంగాణ ఉన్నత విద్యామండలి

## చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

- వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం నియామకం
- ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు
- ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ప్రకటన
- కోఠి మహిళా యూనివర్సిటీ ఇంఛార్జి వీసీగా ధనావత్ సూర్య

హైదరాబాద్

తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంను నియమించింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. వీరిద్దరూ ఆయా పదవుల్లో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. కాగా, ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ప్రస్తుతం నల్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్నారు. ఈ రెండు నియామకాలతో పాటు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలకు ఇంఛార్జి - మిగతా3లో





## మోదీ దీపావళి గిఫ్ట్..

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు
- 48లక్షల ఉద్యోగులు.. 67లక్షల మంది పెన్షనర్‌లకు గుడ్‌న్యూస్..
- వారణాసిలో రూ.2,642 కోట్లతో రైల్-రోడ్ బ్రిడ్జి
- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం
- రబీలో ఆరు పంటల కనీస మద్దతు ధర పెంపు..
- యూరియేతర ఎరువుల సబ్సిడీకి కేంద్రం ఆమోదం

-2లో

### విమానాలకు బాంబు బెదిరింపులు..

## కీలక నిర్ణయం తీసుకున్న కేంద్రం!

- దేశవ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాల నుంచి వచ్చే విమానాల్లో స్కై మార్షల్స్‌ని రెట్టింపు చేయాలని నిర్ణయం
- గడిచిన మూడురోజుల్లో 12 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి
- ఈ క్రమంలో భద్రతా ఏజెన్సీలు తనిఖీలు నిర్వహించి.. ఫేక్ బెదిరింపులుగా తేల్చారు



## ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు

- రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం కేంద్ర ప్రభుత్వం నిర్మించాలి
- కానీ ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని కావాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తానంటోంది
- రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తే ప్రజలపై రూ. 20 వేల కోట్ల భారం పడుతుంది
- ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం 158 కి.మీ. మేర కేంద్రమే నిర్మిస్తోంది.
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్

ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొంత మంది నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం కేంద్ర ప్రభుత్వం నిర్మించాలి. కానీ ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని కావాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తానంటోంది. రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తే ప్రజలపై రూ. 20 వేల కోట్ల భారం పడుతుంది. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం 158 కి.మీ. మేర కేంద్రమే నిర్మిస్తోంది. ఉత్తర భాగం నిర్మాణం కోసం భూసేకరణ ఇంకా ప్రారంభించలేదని హరీశ్‌రావు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రతి నియోజకవర్గానికి రూ. 5 కోట్లు ఇస్తామని బడ్జెట్‌లో చెప్పారు. 6 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. వెంటనే నియోజకవర్గ - మిగతా3లో



# ఏపీలో రిపోర్ట్ చేయాల్సిందే



**హైదరాబాద్ :** తెలంగాణ హైకోర్టులో ఐఏఎస్ అధికారులకు చుక్కెదురైంది. తమను రిలీవ్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలన్న ఐఏఎస్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. డీవోపీటీ కేటాయించిన రాష్ట్రాల్లో ముందు మీరు విధుల్లో చేరాలని అధికారులకు హైకోర్టు సూచించింది. అయితే కేటాయింపునకు సంబంధించి పునఃపరిశీలన చేయాలని డీవోపీటీని ఆదేశించమంటారా? అని అధికారులను అడిగింది. ఇలాంటి అంశాలపై స్టే ఇస్తూ వెళితే కనుక ఎన్నటికీ తేలదని హైకోర్టు వ్యాఖ్యానించింది. మీరంతా బాధ్యతాయుతమైన అధికారులు... ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉండవద్దని హితవు పలికింది. మీరు ఎక్కడ పని చేయాలో కేంద్రం నిర్ణయిస్తుందని స్పష్టం చేసింది.

ప్రస్తుతం ఉన్న రాష్ట్రాల్లోనే కొనసాగేందుకు ప్రయత్నిస్తున్న ఏపీ, తెలంగాణకు కేటాయించిన క్యాడర్ సివిల్ సర్వీస్ అధికారులకు హైకోర్టులో కూడా ఊరట లభించలేదు. డీవోపీటీ ఆదేశాల మేరకు వెళ్లి కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని సూచించింది. మాజీ చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్ విషయంలో ఇచ్చిన ఉత్తర్వులే వీరి విషయంలోనూ వర్తిస్తాయని కేంద్రం తరపు న్యాయవాది హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే తమ సొంత ప్రాంతాలను తప్పుగా నిర్ధారించినందున తమ క్యాడర్ ను మార్చాలని కోరుతున్నారని అందుకే ముందస్తుగా ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని ఐఏఎస్‌ల తరపు న్యాయవాది కోరారు. అయితే ఐఏఎస్‌లు అయినంత మాత్రాన స్టే ఎలా ఇస్తామని కోర్టు ప్రశ్నించింది. అయితే ఐఏఎస్‌లకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. ఐఏఎస్‌లను ఇప్పటికిప్పుడు రిలీవ్ చేయడం కష్టమని కనీసం పదిహేనురోజుల సమయం ఉండాలని అఫిడవిట్ దాఖలు చేసింది. ట్రిబ్యునల్ కొట్టేస్తే హైకర్టుకు రావడం సరి కాదని కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లి రిపోర్టు చేసిన తర్వాతనే పిటిషన్‌పై విచారణ జరుపుతామన్నారు. సివిల్ సర్వీస్ అధికారులు ఎక్కడ కేటాయిస్తే అక్కడకు వెళ్లి విధి నిర్వహణలో పాల్గొనాలన్నారు. వాదనలు పూర్తయిన తర్వాత తీర్పు ను రిజర్వ్ చేశారు. ఆయా రాష్ట్రాల్లో రిపోర్టు చేసిన తర్వాతనే విచారణ చేస్తామని హైకోర్టు స్పష్టం చేయడంతో కేటాయించిన క్యాడర్ రాష్ట్రానికి వెళ్లి రిపోర్టు చేస్తారా? యల్లిన తప్పని పరిస్థితి ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఏర్పడింది. తెలంగాణ నుంచి ఐఏఎస్‌లు ఏపీ క్యాడర్‌కు వెళ్లాల్సి ఉంది. వారిలో గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ కాట అమ్రపాలి కూడా ఉన్నారు. రోనాల్డ్ రోస్, వాకాటి కరుణ, వాణి ప్రసాద్ ఏపీలో రిపోర్టు చేయాల్సి ఉంది. అలాగే ఏపీ నుంచి గరిమెళ్ల సృజన, శివశంకర్, హరికృష్ణ తెలంగాణలో రిపోర్టు చేయాల్సి ఉంది. రాష్ట్ర విభజన జరిగిన సమయంలో అధికారులను ప్రత్యూష్ సిన్హా కమిటీ విభజించింది. యూపీఎస్సీ రికార్డుల ప్రకారం శాశ్వత నివాసం ఆధారంగా ఏపీ అయితే ఏపీకి..తెలంగాణ అయితే తెలంగాణకు కేటాయించారు. కొంత మంది కాట అమ్రపాలి తమ శాశ్వత అడ్రస్ ను విశాఖగా పేర్కొనడంతో ఆమెను ఏపీకి కేటాయించారు. ఇలాగే ఇతరుల్ని కేటాయించారు. కేటాయింపులపై అప్పట్లో క్యాట్ కు వెళ్లి స్టే ఉత్తర్వులు తెచ్చుకుని తమకు నచ్చిన రాష్ట్రాల్లో కొనసాగుతున్నారు.తెలంగాణ చీఫ్ సెక్రటరీగా పని చేసిన సోమేష్ కమార్ కు కూడా ఏపీ క్యాడరే కేటాయించారు. ఆయనకు కూడా గతంలో కోర్టు వ్యతిరేక తీర్పు ఇచ్చింది. దాంతో ఆయన సీఎస్ పదవి నుంచి వైదొలిగి ఏపీలో రిపోర్టు చేశారు. తర్వాత వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. అదే తీర్పు ప్రస్తుత ఐఏఎస్‌లకూ వర్తిస్తుంది.

# మోదీ దీపావళి గిఫ్ట్



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నరేంద్ర మోదీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగులు, పెన్షనర్లకు దీపావళి కానుకగా 3 శాతం కరవు భత్యాన్ని పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మూలవేతనంలో 50 శాతం ఉన్న డీఏ 53 శాతానికి చేరుతుంది. ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి దీన్ని అమలు చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో 10 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది.

కాగా, సార్వత్రిక ఎన్నికలకు ముందు మార్చిలో డీఏను 4 శాతం కేంద్రం పెంచింది. అది జనవరి 2024 నుంచి అమల్లోకి వచ్చింది. మూడు నెలల బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. ఏటా ప్రభుత్వం రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏను సవరిస్తుంటుంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఈ కరవు భత్యాన్ని నిర్ణయిస్తారు. ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (ఏఐసీపీఐ) ఆధారంగా డీఏ పెంపుదలను లెక్కిస్తారు.

**వారణాసిలో రూ.2,642 కోట్లతో రైల్-రోడ్ బ్రిడ్జి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర మంత్రివర్గం బుధవారంనాడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. వారణాసిలో గంగానదిపై కొత్త రైల్-రోడ్ బ్రిడ్జి నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జనసామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రపంచంలోని అతి పెద్ద వంతెనల్లో ఇదొకటి అవుతుందని క్యాబినెట్ సమావేశానంతరం రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు తెలిపారు.

రూ.2,642 కోట్లతో..

కొత్త రైల్-రోడ్ బ్రిడ్జిని రూ.2,642 కోట్లతో నిర్మించనున్నట్టు అశ్విని వైష్ణవ్ తెలిపారు. "మాల్వియ బ్రిడ్జి కట్టి 137 ఏళ్లయింది. ఇప్పుడు కొత్త బ్రిడ్జి నిర్మాణం జరపనున్నాం. లోయర్ డెక్‌లో 4 రైల్వే లైన్లు, అప్పర్ డెక్‌పై 6 లేన్ల హైవే ఉంటుంది. ట్రాఫిక్ కెపాసిటీ దృష్ట్యా ప్రపంచంలోనే అతి పెద్ద బ్రిడ్జిలలో ఇదొకటి అవుతుంది" అని మంత్రి తెలిపారు.

కాగా, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి-చౌందౌలి జిల్లాల గుండా కొత్త వంతెన నిర్మాణం జరుగనుందని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇండియన్ రైల్వేస్‌కు క్రూషియల్ హబ్‌గా వారణాసి రైల్వే స్టేషన్ ఉందని, యాత్రికులు, పర్యాటకులు, స్థానిక జనాభాకు గేట్‌వేగా నిలుస్తోందని పేర్కొంది. పెరుగుతున్న టూరిజం, ఇండస్ట్రియల్ డిమాండ్‌కు అనుగుణంగానే కొత్త రైల్-రోడ్ బ్రిడ్జి నిర్మాణం జరగనుందని తెలిపింది. ఇందువల్ల ఈ ప్రాంత సామాజిక-ఆర్థిక వృద్ధి కూడా పెరుగుతుందని, స్వయం ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొంది. ప్రధాన మంత్రి మోదీ 'న్యూ ఇండియా' విజన్, 'ఆత్మ నిర్భర్ భారత్' విజన్ దిశగా ఇదొక ముందడుగు అని అభివర్ణించింది.

**యూరియేతర ఎరువుల సబ్సిడీకి కేంద్రం ఆమోదం**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, రైతులకు శుభవార్త చెప్పింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3శాతం డీఏను పెంచనున్నట్లు ప్రకటించింది. 2025-26 రబీలో ఆరు పంటలకు కనీస మద్దతు ధరను కేంద్రం ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం కేంద్ర కేబినెట్ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలు కేబినెట్ ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. ఆరుపంటల కనీస మద్దతు ధరను పెంచుతున్నట్లు వెల్లడించింది. గోధుమల కనీస మద్దతు ధరను రూ.2425, బార్లీ మద్దతు ధరను రూ.1,980. మినుములు రూ.5,650, కందులు రూ.6,700, ఆవాలు రూ.5,950, కుసుమల ధరను రూ.5,940 పెంచుతున్నట్లు ప్రకటించింది. అలాగే, రబీలో యూరియేతర ఎరువులకు రూ.24,475 కోట్ల రాయితీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**ఉద్యోగులకు డీఏ ఎంత పెరుగుతుంది..**

ఒక ఉద్యోగి బేసిక్ వేతనం రూ.18వేలు ఉంటే.. 53శాతం డియర్‌నెస్ అలవెన్స్ ప్రకారం.. సదరు ఉద్యోగి వేతనం ప్రతినెలా దాదాపు రూ.54. వరకు పెరుగుతుంది. ఉద్యోగి బేసిక్ వేతనం రూ.25వేలు నెలకు రూ.750 బెనిఫిట్ లభిస్తుంది. కార్మికుడి మూలవేతనం రూ.35వేలు అయితే నెలకు రూ.1050 అదనంగా చెల్లించనున్నారు. రూ.52వేల బేసిక్ జీతం అందుకుంటే కార్మికులకు.. డీఏ పెంపుతో నెలకు రూ.1,560 అదనంగా ప్రయోజనం పొందుతారు. రూ.లక్ష బేసిక్ వేతనం ఉంటే ఉద్యోగి అకౌంట్‌లో నెలకు రూ.3వేలకుపైగా అదనంగా జమ అవుతుంది. సాధారణంగా డీఏ, డీఆర్ రేట్స్ పెంపు ప్రకటన సెప్టెంబర్‌లో జరుగుతుంది. అయితే, డీఏ పెంపును అక్టోబర్‌లోనూ ప్రకటించిన సందర్భాలున్నాయి. అక్టోబర్ 3న జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశంలో రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్‌ను కేంద్రం ప్రకటించింది. రైల్వే ఉద్యోగులకు రూ.2029కోట్ల బోనస్‌ను ఆమోదించినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ నెల 9న జరిగిన కేబినెట్ సమావేశంలో డీఏ ప్రకటిస్తారని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆశించారు. సెప్టెంబర్ 30న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్‌బీ యాదవ్ కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాశారు. జాప్యం చేయకుండా డీఏ పెంచాలని డిమాండ్ చేశారు. అక్టోబర్‌లో అలవెన్స్ ప్రకటిస్తే.. నవంబర్‌లో చెల్లింపులు చేయవచ్చన్నారు.


**ఆలస్యంతో కేంద్రానికే లబ్ధి**

డీఏను సకాలంలో విడుదల చేయకపోవడంతో కేంద్ర ప్రభుత్వమే లాభపడుతున్నదని ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఆర్థిక మంత్రికి రాసిన లేఖలో డియర్‌నెస్ అలవెన్స్ డియర్‌నెస్ రిలీఫ్ గడువు జూలై ఒకటిన ముగియనుందని.. సాధారణంగా సెప్టెంబర్‌లో చివరి వారంలో డీఏ పెంపు ప్రకటన ఉంటుందని ఎస్‌బీ యాదవ్ పేర్కొన్నారు. అక్టోబర్ మొదటి వారంలో ఉద్యోగులకు మూడునెలల బకాయిలు చెల్లించారు. అలవెన్సుల ప్రకటనలో జాప్యంపై కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. నవరాత్రి, దుర్గాపూజ, దసరా పండగలు ముగిసినా కానీ పెంపుపై ప్రకటన చేయలేదు. డీఏ, డీఆర్ పెంపుతో ప్రభుత్వంపై రూ.వేలకోట్ల భారంపడుతుందని.. మూడు, నాలుగు నెలలు ఆలస్యంగా ప్రకటిస్తున్నది. ఈ కాలంలో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టి తద్వారా వడ్డీ ద్వారా ఆదాయం పొందుతుందని ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. జనవరి ఒకటి, జూలై ఒకటి నుంచి డీఏ, డీఆర్ పెంచాలని నిబంధన ఉన్నది. కేంద్ర ప్రభుత్వం ప్రతిసారీ మూడు నుంచి నాలుగు నెలలు ఆలస్యం చేస్తూ వస్తున్నది. ఇలా ఆలస్యమైతే ప్రభుత్వానికి వేలకోట్లు ఆదా అవుతాయని ఇండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (%ఙూ×ఙజుళీ%) జనరల్ సెక్రటరీ, నేషనల్ కౌన్సిల్ (%జఐవీ%) స్టాఫ్ సైడ్ సీనియర్ సభ్యుడు సీ శ్రీకుమార్ పేర్కొన్నారు.

## విమానాలకు బాంబు బెదిరింపులు..

# కీలక నిర్ణయం తీసుకున్న కేంద్రం..!

దేశంలోని పలు విమానాలు, విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు భారీగా పెరిగాయి. ఈ బెదిరింపులు కేంద్ర ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. దేశవ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాల నుంచి వచ్చే విమానాల్లో స్కై మార్షల్స్‌ని రెట్టింపు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విమానాలు, విమానాశ్రయాలకు పెరుగుతున్న ముప్పును అంచనా వేసి.. నిఘా సంస్థల నుంచి వచ్చిన ఇన్‌పుట్స్ అందిన తర్వాత స్కై మార్షల్ సంఖ్యను రెట్టింపు చేయాలని నిర్ణయించినట్లు హోంమంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి తెలిపారు. గడిచిన మూడురోజుల్లో 12 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ క్రమంలో భద్రతా ఏజెన్సీలు తనిఖీలు నిర్వహించి.. ఫేక్ బెదిరింపులుగా తేల్చారు. నిరంతరం పెరుగుతున్న బెదిరింపుల మధ్య బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో చర్చించింది. ఈ చర్చల్లో బెదిరింపులను గుర్తించడానికి, నో ఫ్లై జాబితాలో చేర్చేందుకు ఏజెన్సీలు కలిసి పని చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తున్నది. దాంతో పాటు ఎఫ్ఐఏ నివేదిక ఆధారంగా సెన్సిటివ్ కేటగిరిలో చేర్చిన కొత్త అంతర్జాతీయ మార్గాల్లో కొత్త బ్యాచ్ ఎయిర్ మార్షల్స్‌ని మోహరించనున్నట్లు అధికారి చెప్పారు.



భద్రతా సంస్థలతో పలు సమావేశాల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పార్లమెంటరీ కమిటీ ముందు ఈ అంశాన్ని లేవనెత్తారు. విమానాశ్రయాలు, విమానాలకు వస్తున్న బెదిరింపుల అంశం బుధవారం పార్లమెంటరీ కమిటీలో వేడెక్కింది. ఈ విషయమై ఎంపీలు అడిగిన ప్రశ్నలకు పౌర విమానయాన శాఖ కార్యదర్శి వుమ్లున్మాంగ్ వుల్నమ్ స్పందిస్తూ.. నిందితులను గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు. ఏజెన్సీలు చర్యలు తీసుకుంటున్నాయని.. అధికారులు కొంత సమాచారాన్ని సేకరించాయన్నారు. ఫేక్ మెసేజ్‌లపై కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై విచారణ కొనసాగుతున్నందున.. సమాచారం సున్నితత్వాన్ని దృష్టిలో పెట్టుకొని వివరాలను చెప్పేందుకు ఆ అధికారి నిరాకరించారు.

**స్కై మార్షల్స్ అంటే..?**

ఎయిర్ మార్షల్స్ తీవ్రవాద, హైజాకింగ్ నిరోధక చర్యల్లో పాల్గొంటారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్‌లోని విభాగం. స్కై మార్షల్ ప్రధానంగా అంతర్జాతీయ మార్గాలు, కొన్ని సున్నితమైన మార్గాల్లో మోహరిస్తారు. స్కై మార్షల్స్ సాధారణ దుస్తుల్లో ప్రయాణికులతో కలిసి ప్రయాణిస్తుంటారు. కాందహార్‌లో ఎయిర్ ఇండియాకు చెందిన ఐసీ814 విమానాన్ని హైజాక్ చేసిన అనంతరం.. భవిష్యత్‌లో మరోసారి హైజాక్ జరుగకుండా ఉండేందుకు 1999లో భారత్ తొలిసారిగా స్కై మార్షల్‌ని ప్రవేశపెట్టింది. స్కై మార్షల్‌ని ఫ్లై సెక్యూరిటీ ఆఫీసర్ అని కూడా పిలుస్తారు.

## జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఒమర్ అబ్దుల్లా..



ఇవాళ ఉదయం జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అగ్ర నేత ఒమర్ అబ్దుల్లా మధ్యాహ్నం సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకుంటున్నట్టు ఆయన సంబంధిత ఫైలుపై సంతకం చేశారు. అనంతరం జమ్ముకశ్మీర్ ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు చెందిన సెక్రెటరీలతో ఒమర్ సమావేశమయ్యారు. జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన వివిధ అంశాలపై ఆయన వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన అధికారుల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. కాగా ఉదయం 11.30 గంటలకు ఒమర్ అబ్దుల్లా జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. శ్రీనగర్‌లోని 'షేర్ ఇ కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్'లో ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. వారిలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా తదితరులు ఉన్నారు. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, పీడీపీ అధ్యక్షురాలు, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్, సీపీఐ నేత డీ రాజా కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. ఒమర్ అబ్దుల్లా గతంలో కూడా జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత బీజేపీ, పీడీపీ కూటమి అక్కడ అధికారం చేపట్టింది. 2018లో కూటమి సర్కారు కూలిపోవడంతో రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత కేంద్రం జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దుచేసింది. ఆర్టికల్ 370 రద్దు అనంతరం ఇప్పుడే తొలిసారిగా జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.

## జమ్ముకశ్మీర్‌లో భారీ అగ్నిప్రమాదం





**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఒక గ్రామంలో సుమారు 68 ఇళ్లు దగ్ధమయ్యాయి. ఇళ్లు కాలిపోవడంతో నివాసితులు రోడ్డు పాలయ్యారు. స్పందించిన అధికారులు బాధితులకు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. మంగళవారం మధ్యాహ్నం కిష్త్వార్‌లోని ముల్వార్వాన్ గ్రామంలో మంటలు చెలరేగాయి. ఈ అగ్నిప్రమాదంలో 68 ఇళ్లు కాలిపోయాయి. దీంతో వందలాది నివాసితులు కట్టుబట్టలతో మిగిలారు. చలి వాతావరణం నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఇళ్లు కోల్పోయిన బాధితులు కోరారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న అధికారులు స్పందించారు. అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారికి తాత్కాలిక టెంట్లలో ఆశ్రయం కల్పించారు. బాధిత కుటుంబాలకు ఆహారం, దుస్తులు, వైద్య, సహాయక సామగ్రిని అందించినట్లు కిష్త్వార్ డిప్యూటీ కమిషనర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే విపత్తు నిర్వహణ బృందాలను సంఘటనా స్థలానికి పంపినట్లు చెప్పారు. మరోవైపు ఈ అగ్నిప్రమాదంలో 40 ఇళ్లు దెబ్బతిన్నట్లు తొలుత తెలిసిందని రాజేష్ కుమార్ తెలిపారు. అయితే మొత్తం 68 ఇళ్లు కాలిపోయాయని చెప్పారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయంతోపాటు పునరావాసాన్ని కల్పించే చర్యలు చేపడతామని వెల్లడించారు.

## ఏక్‌నాథ్ షిండేనే మహాయుతి సీఎం అభ్యర్థి



**ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ మధ్య సీఎం అభ్యర్థి ఎవరనే విషయంలో సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగుతు న్నాయి. అధికార మహాయుతి ముందుగా సీఎం అభ్యర్థిని ప్రకటించి ఎన్నికలకు రావాలంటూ ఎంవీఏ సవాలు విసిరిన నేపథ్యంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తొలిసారి స్పందించారు. ఏక్‌నాథ్ షిండేనే మహాయుతి సీఎం అభ్యర్థి అంటూ పరోక్షంగా సంకేతాలిచ్చారు. తమ ముఖ్యమంత్రి ఇక్కడే కూర్చున్నందున సీఎం అభ్యర్థి ఎవరనేది ప్రకటించాల్సిన అవసరం మహాయుతి సర్కార్‌కు లేదన్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు అజిత్ పవార్, ఫడ్నవీస్ బుధవారంనాడిక్కడ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. "సీఎం అభ్యర్థిని ప్రకటించాల్సిన పని మాకు లేదు. మా ముఖ్యమంత్రి ఇక్కడే కూర్చున్నారు. మరి మీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో ప్రకటించాలని పవార్ సాహెబ్ (శరద్ పవార్‌ను నేను సవాల్ చేస్తున్నా" అని ఫడ్నవీస్ అన్నారు. ఎన్నికల తర్వాత ఎలాగూ అధికారంలోకి రామని తెలిసే సీఎం అభ్యర్థిని ఎంవీఏ ప్రకటించడం లేదన్నారు

**పవార్ ఏమన్నారు?**

సీఎం అభ్యర్థి విషయంలో శరద్ పవార్ గత నెలలో స్పష్టతనిస్తూ, ఎన్నికలకు ముందు సీఎం అభ్యర్థిని ప్రకటించాల్సిన అవసరం ఎంవీఏకు లేదని, సమిష్టి నాయకత్వం కింద తమ కూటమి పోటీ చేస్తుందని చెప్పారు. సభ్యులను (గెలిచిన సీట్ల సంఖ్యను) బట్టే నాయకత్వ పగ్గాలు చేపట్టేదెవరనే నిర్ణయం ఉంటుందని, ఎన్నికలకు ముందు అలాంటి అవసరం లేదని స్పష్టం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో నవంబర్ 20న జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు వెలువడతాయి.

## వయానాడ్ నుంచి బరిలోకి ప్రియాంక

**న్యూఢిల్లీ :** మరో కీలక ఎన్నికల సమరానికి నగారా మోగింది. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీలతో పాటు కీలకమైన వయనాడ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. నవంబర్ 13న వయనాడు పార్లమెంట్ స్థానానికి ఎన్నిక నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పాటు నవంబర్ 23న వయనాడ ఉప ఎన్నికకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరుగుతుంది.ఈసారి కాంగ్రెస్ పార్టీకి మహారాష్ట్ర, జార్ఖండ్‌తో పాటు వయనాడు పార్లమెంట్ ఉప ఎన్నిక ఎంతో ప్రత్యేకమైందని చెప్పాలి. ఇందుకు ప్రధాన కారణంగా గాంధీ కుటుంబానికి చెందిన ప్రియాంక గాంధీ ఇక్కడి నుంచి పోటీ చేయనుండటమే. గత సార్వత్రిక ఎన్నికల్లో వయనాడుతో పాటు యూపీలోని రాయ్‌బరేలీ నుంచి పోటీ చేశారు కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ. రెండు స్థానాల్లోనూ భారీ మెజార్టీతో గెలిచారు. ఈ రెండు స్థానాల్లో ఆయన ఏ సీటును వదులుకుంటారనే దానిపై కొద్దిరోజులు సస్పెన్స్ కొనసాగింది. అయితే రాయ్‌బరేలీ సీటు నుంచి ఎంపీగా కొనసాగాలని డిసైడయిన రాహుల్ గాంధీ.. వయనాడు ఎంపీ పదవికి రాజీనామా చేశారు. తాను వయనాడు ఎంపీగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన రాహుల్ గాంధీ.. తన స్థానంలో వయనాడు నుంచి పోటీ చేయబోయేది ఎవరనే అంశంపై కూడా క్లారిటీ ఇచ్చేశారు. తన చెల్లెలు ప్రియాంక గాంధీ పోటీ చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు.

# హైడ్రా కారణంగా భయానక వాతావారణం

**హైదరాబాద్ :** తెలంగాణ భవన్ లో నగర ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలతో మూసీ ప్రాజెక్టు పైన కేటీఆర్ సమావేశం నిర్వహించారు. తరువాత మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆనాలోచిత నిర్ణయాల కారణంగా హైదరాబాద్‌లో పేదలు దిగువ మధ్యతరగతి ప్రజలు సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రభుత్వం ఆనాలోచితంగా, ప్రణాళిక లేకుండా పేదలకు ఎవరూ అండగా లేరన్నట్లుగా దూకుడుగా వారి మీదకు వెళ్తోంది. మోడీ నోట్ల రద్దు చేసినప్పుడు ఏ విధంగా రకరకాల కారణాలు మారుస్తూ చెప్పారో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పద్ధతి అవలంభిస్తోంది. ఒక రోజు మూసీ సుందరీకరణ అంటారు. ఒక రోజు నల్గొండకు నీళ్లు అంటారు. ఒక రోజు రూ. లక్షా 50 వేల కోట్లు ఎక్కడివి అంటారు. ఒక రోజు డీపీఆర్ లేనే లేదంటారని అన్నారు. ఒక ప్రణాళిక, ఆలోచన లేకుండా ముందుకు వెళ్తున్నారు. ప్రభుత్వమే 50 ఏళ్ల క్రితమే పర్మిషన్లు ఇచ్చి ఇప్పుడు వాటిని కూలగొడతామని దుందుడుకుగా పోతామంటే కుదరదు. హైడ్రా, మూసీ ప్రాజెక్ట్ విషయంలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారు.

హైడ్రాను పెద్ద, పెద్ద బిల్డర్లను బెదిరించేందుకే ఉపయోగిస్తున్నారని మేము నమ్ముతున్నాం. మూసీ పేరిట ఏ విధంగా లూటీ చేస్తున్నారో ప్రజల దృష్టికి తీసుకెళ్తాం. మూసీ కి సంబంధించి 100 శాతం మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను మేము రూ. 4 వేల కోట్లతో నిర్మించామని అన్నారు.

మూసీ శుద్ధి మేము చేశాం. దీంతో ఇక నల్గొండ జిల్లాకు వెళ్లే నీళ్లన్ని శుద్ధి చేసిన నీళ్లే వెళ్తాయి. దాని కోసం కొత్తగా ఖర్చు చేయాల్సిన పని లేదు. కొండపోచమ్మ సాగర్ నుంచి గండిపేట్ కు నీళ్లు తెచ్చేందుకు 11 వందల కోట్లు ఖర్చు చేయాలని మేము నిర్ణయం తీసుకున్నాం. ఇక రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. నల్గొండకు మంచి నీళ్లు ఇచ్చే ఏర్పాట్లు మేము చేశాం. ఇక నల్గొండ కు నీళ్లు ఇచ్చే ఇష్టం లేదా అంటూ ముఖ్యమంత్రి గారు ఆరోపణలు చేయాల్సిన అవసరం లేదు. గతంలోనే మేము మూసీ సుందరీకరణ చేపట్టాలని సుధీర్ రెడ్డి ఛైర్మన్ గా ప్రయత్నం చేశాం. కానీ గరీబోళ్లకు అన్యాయం జరుగుతదంటే ఆ ప్రాజెక్ట్ వద్దని కేసీఆర్ చెప్పారు. మానవీయ ముఖ్యమంత్రి ఉంటే ఆ విధంగా నిర్ణయాలు ఉంటాయి. మూసీ సుందరీకరణ మేము కూడా చేశాం. కానీ ఒక్క పేదవాడి కడుపు కూడా కొట్టలేదు. మూసీ సుందరీకరణకు రూ. లక్షా 50 వేల కోట్లు ఎందుకో చెప్పాలి. 50 ఏళ్ల క్రితం పట్టాలిచ్చిన వారిని హైడ్రా పేరుతో కూల్చివేస్తామంటే కుదరదు, మీరు చేసిన తప్పునకు పేదలను బలి చేస్తారా? మీరే పట్టాలిచ్చి మీరే కూలగొడుతారా అని



ప్రశ్నించారు. పేదలకు ఎవరు దిక్కు లేరన్నట్లుగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తామంటే బీఆర్ఎస్ ఊరుకోదు. హైదరాబాద్ లోని పేదలకు బీఆర్ఎస్ రక్షణ కవచంగా ఉంటుంది. రేవంత్ రెడ్డి పంపే బుల్డోజర్లకు అడ్డుగా మా నాయకులు ఉంటారు. మేము నిర్మించిన అన్ని ఎస్టీపీలను కూడా మా ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటిస్తామని అన్నారు. మా ప్రభుత్వం ఉన్నప్పుడు నాలా డెవలప్ మెంట్ కార్యక్రమం తీసుకున్నాం. దాని ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాలను కూడా సందర్శిస్తాం. హైడ్రా పేరుతో ప్రభుత్వం భయపెడుతున్న అన్ని ప్రాంతాలకు వెళ్లి అక్కడి ప్రజలకు మేము భరోసా ఇస్తాం. అదే విధంగా ప్రభుత్వం చట్టాన్ని గౌరవించకపోతే మేము న్యాయపరంగా కూడా పోరాటం చేస్తాం. ఆర్ఎస్ లీగల్ సెల్ కు దాదాపు 450 మంది వచ్చి అండగా ఉండాలని కోరారు. మా పార్టీ లీగల్ సెల్ ను మరింత బలోపేతం చేస్తాం. లీగల్ సెల్ వాళ్లు చాలా కష్టపడి పనిచేస్తున్నారు. వారికి అభినందనలు. ఈ ప్రభుత్వం చట్టానికి వ్యతిరేకంగా పనిచేస్తూ ప్రజలను కబ్జాదారులు అంటున్న విధానాన్ని ఎండగడతాం, హైడ్రా కారణంగా భయానక వాతావారణం వచ్చింది. మొన్న హైడ్రా పేరుతో కాంగ్రెస్, ఎంఐఎం నాయకులే కొట్టుకున్నారు. ఈ ప్రభుత్వ దిక్కుమాలిన పాలన కారణంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ మొత్తం పడిపోయింది. మాకు అప్పు పుట్టటం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అంటున్నారు. మీ ముఖ్యమంత్రే దివాళా కోరు మాటలు మాట్లాడితే అప్పులు ఎలా పుడుతాయి. నిర్మాణం కాదు విధ్వంసం చేస్తామంటే ఇలాంటి పరిస్థితే ఉంటుంది. బీజేపీ నాయకుల కన్నా ఎక్కువగా రేవంత్ రెడ్డి దేశ రక్షణ గురించి మాట్లాడుతున్నాడు. ఆయన మాటలు ఆశ్చర్యంగా అనిపించాయి. దేశ రక్షణకు బీఆర్ఎస్ కట్టుబడి ఉంది. ఏ మూసీ సుందరీకరణ అంటున్నావో, అదే ప్రాంతంలో 12 లక్షల చెట్లు నరికివేసి ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా ఎలా న్యాయం చేస్తారు. గంగా నది పుట్టిన గంగోత్రి వద్ద 150 కిలోమీటర్లు ఎకో సెన్సిటివ్ జోన్ అంట. మరి మూసీకి కనీసం 10 కిలోమీటర్ల ఎకో సెన్సిటివ్ జోన్ లేదా? మేమే కేబీఆర్ పార్క్ వద్ద ఫ్లై ఓవర్లు కట్టాలని అనుకున్నాం. పర్యావరణం దెబ్బతింటుందంటే ఆ ప్రతిపాదనలను విరమించుకున్నాం. 2017 లో రాడార్ నిర్మాణం కోసం జీవో ఇచ్చినప్పటికీ పర్యావరణం దెబ్బ తింటుందంటే మేము ఆ జీవో ను తొక్కి పెట్టామని అన్నారు. మేము జీవో ఇచ్చామని చెబుతున్నావ్. మేము చేసిన పనులన్నీ చేస్తున్నావా? రైతు బంధు, 24 గంటల కరెంట్, ఫించన్, పాలమూరు ఎత్తిపోతల మేము చేశాం. మరి నువ్వు వాటిని చేస్తున్నావా? మేము పర్యావరణ రక్షణ కోసం పనిచేశాం కాబట్టే ఇచ్చిన జీవోలను నిలిపివేశాం. రేవంత్ రెడ్డికి ప్రధాని మోడీని ఒక్క మాట అనాలంటే దడ. అందుకే మనకు కేంద్ర బడ్జెట్ లో అన్యాయం జరిగినప్పటికీ అసెంబ్లీలో ఒక్క మాట మాట్లాడలేదని అన్నారు. జనవాసాలు లేని చోట పెట్టే రాడార్ కేంద్రాన్ని?తెలంగాణలో ఎందుకు పెట్టినట్లు? మూసీని పురిట్లోనే ఆగం చేసి కింద మాత్రం మంచి చేస్తామంటే ఎవరూ నమ్ముతారు. హైదరాబాద్ లో ప్రజలకు భరోసా ఇచ్చేందుకు మా నాయకులంతా కలసికట్టుగా కదులుతాం. ప్రజలకు ఏమైనా ఇబ్బంది వస్తే మా ప్రజాప్రతినిధులను కలవండి. లేదంటే తెలంగాణ భవన్ కు రండి. మీకు న్యాయం తప్పకుండా జరగుతుంది. మా ఫార్మ్ హౌస్ లు చట్ట విరుద్ధంగా ఉంటే వాటిని కొట్టేయండి. మా ఫార్మ్ హౌస్ లు కూలగొడితే నీకు రాక్షస ఆనందం వస్తదంటే కూలగొట్టు. కానీ పేద ప్రజల జోలికి వెళ్లకు. పేద ప్రజలను ఆగం చేస్తామంటే వారి ఇళ్లు కూలగొడతామంటే ఊరుకోం, మేము అధికారంలోకి వచ్చే నాటికి ఉన్న బకాయి ఫీజు రీయింబర్స్ మెంట్ 2 వేల కోట్లను చెల్లించాం. ప్రభుత్వం అనేది కంటిన్యూ ప్రాసెస్. గత ప్రభుత్వ బకాయిలను చెల్లించాలి. రూ. 650 కోట్లు ఇస్తే సరిపోతుందని కాలేజీ యాజమాన్యాలు చెబుతున్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లిస్తే దాదాపు 12 లక్షల మందికి మేలు జరుగుతుంది. గత ప్రభుత్వాలు బకాయిలు పెడితే ఇప్పుడు ఉన్న ప్రభుత్వాలు కట్టాల్సిందే. అది నెక్స్ మేము అధికారంలోకి వచ్చినా తప్పదని అన్నారు. రేవంత్ రెడ్డి 10 నెలల్లో 80 వేల కోట్ల అప్పు చేశారు. ఒక్క కొత్త ప్రాజెక్ట్ కూడా చేపట్టలేదు. మరి అంత డబ్బు ఎక్కడికి పోయింది. మన రాష్ట్రం రెవెన్యూ సర్ ప్లేస్ స్టేట్. మనం అన్ని కట్టిన తర్వాత కూడా మిగులు ఉందని భట్టి చెప్పారు. మరీ ఎందుకు ఇంత పెద్ద ఎత్తున అప్పు చేశారో చెప్పాలి. హైడ్రా, మూసీ పేరుతో సృష్టిస్తున్న భయాకన వాతావారణం నుంచి ప్రజలను రక్షించేందుకు బీఆర్ఎస్ కదులుతోంది. త్వరలోనే షెడ్యూల్ ప్రకటిస్తామని అన్నారు.

# ఇందిరమ్మ కమిటీలతో పార్టీ బలోపేతం

**-మొదటిపేజీ తరువాయి**

రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరవాత ఇందిరమ్మ కమిటీల ప్రస్తావన తెచ్చారు. ప్రభుత్వ ప్రతి పథకం ప్రజలకు ఇందిరమ్మ కమిటీల ద్వారానే చేరుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని పార్టీని ప్రతి ఇంటికి తీసుకెళ్లేలా చేయాలని ఆయన అనుకున్నారు. కారణం ఏమైనా తర్వాత ఆలస్యం జరిగింది. రుమమాఫీని ప్రకటించారు. హడావుడిగా అమలు చేశారు. కానీ ఆ రుణమాఫీని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం సరిగ్గా జరగలేదు. ఇందిరమ్మ కమిటీలు ఉంటే నేరుగా ఇంటింటికి తీసుకెళ్లేవారు. ఆలస్యంగా అయినా ఇప్పుడు ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇప్పుడు ఆ కమిటీ చేతుల మీదుగానే ఇళ్ల నిర్మాణ పథకానికి లబ్దిదారులను ఎంపిక చేయబోతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్ని ఇప్పటికే నిర్వహించాల్సి ఉంది. కానీ కులగణన తర్వాతనే ఎన్నికలు నిర్వహిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఇప్పుడు ప్రక్రియను ప్రారంభించారు. నివేదిక వచ్చిన తర్వాత ఇతర చట్టపరమైన పనులు పూర్తి చేసి ఎన్నికలు నిర్వహించాలంటే మరో నాలుగైదు నెలల సమయం పట్టవచ్చు. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ పాలక మండలులు గడువు మాత్రమే ఇప్పటికి ముగిసింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల గడువు



మరో ఏడాది వరకూ ఉంది. అన్నీ ఒకే సారి పెట్టేద్దామని అనుకుంటే.. మరో ఏడాది తర్వాత ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. అప్పటికి ఇందిరమ్మ కమిటీ గ్రామాల్లో పట్టు సాధించే అవకాశం ఉంది. నిజానికి ఇందిరమ్మ కమిటీలు వంటి ఏర్పాటు రెండు వైపులా పదునున్న కత్తి లాంటివి. ఎందుకంటే ఎంత ప్లస్ ఉంటుందో అంత మైనస్ ఉంటుంది. ఈ కమిటీల సభ్యులు ప్రజలతో పారదర్శకంగా వ్యవహరించారు. అర్హులైన లబ్దిదారులను మాత్రమే ఎంపిక చేయాలని ఎక్కడైనా పక్షపాతం చూపించినట్లుగా ఆరోపణలు వస్తే ప్రజల్లో వ్యతిరేకత వస్తుంది. అందుకే ఇందిరమ్మ కమిటీల సభ్యుల్లో కీలకమైన వ్యక్తుల్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంది. ఇప్పుడు సర్పంచ్‌లు లేరు కాబట్టి స్పెషలాఫీసర్లే కమిటీ చైర్మన్ గా ఉంటారు. అయినా పార్టీ నేతల ప్రభావం ఎక్కువ గానే ఉంటుంది. ఈ కమిటీలపై వ్యతిరేక ప్రచారం సహజం గానే జరుగుతుంది. కానీ ప్రజలు నమ్మకంగా ఉండేలా చూసుకోవడం ఆ కమిటీల మీదనే ఆధారపడి ఉంటుంది. అంతా సాఫీగా సాగితే కాంగ్రెస్ పార్టీ పునాదుల్ని ఇందిరమ్మ కమిటీలు మరింత బలోపేతం చేస్తాయని అనుకోవచ్చు.

# డ్రగ్స్ ఫ్రీ కోసం రంగంలోకి అకున్ సబర్వాల్

**హైదరాబాద్ :** తెలంగాణలో డ్రగ్స్ మాట వినపడాలంటే భయపడాలంటూ పిలుపునిచ్చారు. డ్రగ్స్ మహమ్మారితో కుటుంబాలు నాశనం అవుతున్నాయని, ఉద్యమాలకు కేరాఫ్ అయిన తెలంగాణ డ్రగ్స్ రాజ్యమేలుతోందని ఆ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే.. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాను తరిమికొట్టేందుకు వేగంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారని అర్థం అవుతోంది. ఇందుకోసం ఆయన ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి బాధ్యతల స్వీకరణ సందర్భంలోనూ రేవంత్ డ్రగ్స్ మహమ్మారిపై కీలక వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీ తెలంగాణగా మారుస్తానంటూ శపథం చేశారు. తెలంగాణలో డ్రగ్స్ మాట వినపడాలంటే భయపడాలంటూ పిలుపునిచ్చారు. డ్రగ్స్ మహమ్మారితో కుటుంబాలు నాశనం అవుతున్నాయని, ఉద్యమాలకు కేరాఫ్ అయిన తెలంగాణ డ్రగ్స్ రాజ్యమేలుతోందని ఆ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే.. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాను తరిమికొట్టేందుకు వేగంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే.. ఇటీవల రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కేటీఆర్ పై వ్యాఖ్యలు చేసిన సందర్భంగా సినీ నటుడు నాగార్జున ఫ్యామిలీని కూడా ప్రస్తావించారు. నాగచైతన్య-సమంత విడాకుల అంశాన్ని ఆమె లేవనెత్తారు. దాంతో నాగార్జున ఆ వ్యాఖ్యల్ని సీరియస్‌గా తీసుకున్నారు. అటు యావత్ టాలీవుడ్ సినీ ప్రపంచం కూడా



సురేఖ వ్యాఖ్యల్ని ఖండించారు. అందరూ ఏకతాటిపైకి వచ్చి సురేఖ వ్యాఖ్యల్ని తప్పుబట్టారు. దాంతో ప్రతిపక్షంతో కలిసి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. నాగార్జునకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్ హైడ్రా కూల్చివేసినప్పటికీ ఎవరూ పెద్దగా స్పందించలేదు. అలాగే.. నంది అవార్డులను కాస్త గద్దర్ అవార్డులుగా మార్చినప్పుడు కూడా పెద్దగా పట్టించుకోలేదు. ఇక దాంతో అప్పటి నుంచే టాలీవుడ్ వర్సెస్ ప్రభుత్వం అన్నట్లుగా కోల్డ్‌వార్ నడుస్తూనే ఉంది. సురేఖ వ్యాఖ్యలపై ఒక్కసారిగా అందరూ ముందుకు రావడంతో ప్రభుత్వం పెద్దలు కూడా సీరియస్‌గా తీసుకున్నారు.ఇందులో భాగంగానే గతంలో టాలీవుడ్ డ్రగ్స్ కేసును మరోసారి తెరమీదకు తీసుకొచ్చేందుకు ప్లాన్ సిద్ధం చేసినట్లు సమాచారం. అందుకే.. టాలీవుడ్ డ్రగ్స్ కేసులో కీలకంగా వ్యవహరించిన ఐపీఎస్ అకున్ సబర్వాల్‌ను మరోసారి తెలంగాణకు తీసుకొస్తున్నారు. మరోసారి ఆ కేసును తోడి అందులో భాగస్వాములైన వారిపై చర్యలు తీసుకునేలా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. అయితే.. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ అప్పీల్‌తో పలువురు సినీ ప్రముఖులు డ్రగ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా షార్ట్ వీడియోలు చేసి ప్రచారం సాగిస్తున్నప్పటికీ.. ఇంకా చాలా మంది టాలీవుడ్‌లో డ్రగ్స్ వినియోగిస్తున్నారని అపవాదు ఉంది.అందుకే..ఈ కేసుపై పూర్తి అవగాహన ఉన్న అకున్ సబర్వాల్‌ను మరోసారి రంగంలోకి దింపబోతోంది. అకున్ ఎంట్రీతో మరోసారి టాలీవుడ్‌లో ప్రకంపనలు మొదలు కానున్నాయన్న టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే చాలా మంది టాలీవుడ్ ప్రముఖులను ఆయన విచారించారు. ఇంకా కొంత మందిని విచారించే క్రమంలో ఆయనను బదిలీ తప్పలేదు. దాంతో అప్పటి నుంచి ఆ కేసు మూలనపడింది. ఇక ఇప్పుడు ఆయన రాకతో ఈ డ్రగ్స్ కేసు ఎటు మలుపు తిరుగుతుందా అని ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. ముఖ్యంగా టాలీవుడ్‌లో ఆ టెన్షన్ మరింత ఎక్కువైనట్లుగా ప్రచారం జరుగుతోంది. మొత్తానికి తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ స్టేటుగా మార్చే క్రమంలో రేవంత్ సర్కార్ మరోసారి టాలీవుడ్ నుంచే తన పనిని మొదలుపెట్టబోతున్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

**-మొదటిపేజీ తరువాయి**

వీసీలను ప్రభుత్వం మార్చింది. కోఠి మహిళా యూనివర్సిటీ ఇంఛార్జి వీసీగా ధనావత్ సూర్య, బాసర ట్రిపుల్ ఐటీ ఇంఛార్జి వీసీగా ప్రొఫెసర్ గోవర్ధన్‌ను నియమించారు. కాగా, సూర్య ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

## సమగ్ర కులగణనకు కసరత్తు!

**-మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత భారాస ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని గత కొన్నాళ్ల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో పదేళ్ల అనంతరం మరోసారి సమగ్ర కులగణన చేపట్టనుండటం విశేషం.

**సమగ్ర వివరాల సేకరణ**

కులగణనలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి కుటుంబం కులంతో పాటు వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్యా, ఉద్యోగం తదితర పరిస్థితులను సేకరించనున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి సమగ్ర నివేదికను జిల్లాల వారీగా ప్రభుత్వానికి నివేదించనున్నారు. బీసీల్లోని ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపరచనున్నారు. దీని ద్వారానే రానున్న పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీల కోటాను నిర్ధారించనున్నారు. రాజకీయ అవకాశాలు లభిస్తాయని ప్రస్తుతం మూడు జిల్లాల్లోనూ మొత్తం జనాభాలో సుమారు 52 శాతం బీసీ జనాభా ఉంది. ఉమ్మడి జిల్లాలో అనాదిగా ఆధిపత్య వర్గాల అండ లేకపోవడంతో బీసీలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఏళ్ల నుంచి ఆయా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఈ సర్వే ద్వారా బీసీ లెక్క తేలితే దాని ఆధారంగా రాజకీయ అవకాశాలు లభిస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నోడల్ ఏజెన్సీగా ఉన్న ప్రణాళిక శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఈ సర్వే జరిగే రెండు నెలల పాటు ఇతర శాఖల నుంచి పలువురిని డిప్యుటేషన్ మీద తీసుకోనున్నట్లు తెలిసింది. సర్కారు నుంచి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే క్షేత్రస్థాయిలో పని మొదలుపెట్టాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

## తెలంగాణలో ఘోర రోడ్డు ప్రమాదం...

**కారు కాల్వలో పడి ఏడుగురి మృతి**

**మృతుల్లో నలుగురు మహిళలు, ఇద్దరు బాలికలు**

**మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో విషాదం**

**కారు కాల్వలో పడటంతో నీళ్లలో మునిగి మృతి**




తెలంగాణలోని మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ కారు అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. మృతి చెందినవారిలో నలుగురు మహిళలు, ఇద్దరు బాలికలు, ఓ పురుషుడు ఉన్నారు. మెదక్ జిల్లాలోని శివ్వంపేట మండలం ఉసిరికపల్లి వద్ద ఈరోజు సాయంత్రం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతులను పాముబండ తండాకు చెందిన వారిగా గుర్తించారు. రోడ్డుపై గుంతలు ఉండటంతో వేగంగా వెళుతున్న కారు కల్వర్టును ఢీకొట్టింది. కారు ఎగిరి పక్కనే ఉన్న కాల్వలో పడింది. దాంతో కారులో ఉన్న వారు నీట మునిగి చనిపోయారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. కారు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.

**సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి**

మెదక్ జిల్లా రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని, అవసరమైన సాయం అందించాలని ఆదేశించారు.

## ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు

**-మొదటిపేజీ తరువాయి**

అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఉన్న పథకాలు బంద్ పెట్టడమే కాంగ్రెస్ తెచ్చిన మార్పు. మహిళలకు 2 బతుకమ్మ చీరలు ఇస్తామని రేవంత్ రెడ్డి మోసం చేశారు. రూ. 15 వేలు రైతుబంధు అన్నారు.. గుండుసున్నా చేశారు. కేసీఆర్ కిట్ కంటే మంచిది ఇస్తామని పేద గర్భిణులను మోసం చేశారు. ఆగస్టులో వేయాల్సిన చేప పిల్లలను, అక్టోబర్‌లో వచ్చినా వేయలేదు. చేప పిల్లల కోసం బడ్జెట్‌లో రూ. 16 కోట్లే పెట్టారని హరీశ్‌రావు గుర్తు చేశారు.

**తెలంగాణలో 8,490 ఎంబీబీఎస్ సీట్లు..**

ఎంబీబీఎస్ చదువును గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేరువ చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రతి జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుపేద బిడ్డలు కూడా ఎంబీబీఎస్ చేసే అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ పాలనను కొనియాడుతూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్ర వైద్య విద్యకు హబ్‌గా మారిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మెడికల్ సీట్ల సంఖ్యలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఒకప్పుడు సామాన్యులకు అందుబాటులో లేని వైద్య విద్య ఇప్పుడు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణలో కేవలం ఐదు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ సంఖ్య 34కి చేరిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. 2014 వరకు తెలంగాణలో 2,850 మెడికల్ సీట్లు ఉంటే.. ప్రస్తుతం 8,490 సీట్లు ఉన్నాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాల వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ఈ ఆల్ టైమ్ రికార్డును ఎవరూ చెరిపేయలేరని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## ఇద్దరు పిల్లల తల్లిపై మోజు పడి,,,

**హైదరాబాద్ :** సూరారం పీఎస్ పరిధిలో నాలుగు రోజుల కనిపించకుండా పోయిన చిన్నారి కేసు విషాదాంతమైంది.హైదరాబాద్ సూరారం బాలిక హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అనుమానితుడిగా తిరుపతి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించడంతో కీలక విషయాలు బయటకొచ్చాయి. మొత్తం కుటుంబాన్ని చంపేందుకు నిందితుడి కుట్ర చేసినట్లు పోలీసులు గుర్తించారు. బాలిక తల్లిపై మనసుపడ్డ నిందితుడు తిరుపతి.. ఇద్దరు పిల్లలు, ఆమె భర్తను చంపేందుకు ప్లాన్ చేసినట్లు ఒప్పుకున్నాడు. దానిలో భాగంగానే.. పిల్లల్ని చంపేసి ముళ్ల పొదల్లో పడేయాలని నిర్ణయించుకుని ఒక బాలికను దారుణంగా హత్య చేసిన నిందితుడు.. మరో చిన్నారి హత్యకు సిద్ధమైనట్లు పోలీసుల విచారణలో వెల్లడి కావడం కలకలం రేపుతోంది. ఇక.. పాపను హత్య చేసి మేడ్చల్ అటవీ ప్రాంతంలో వేసినట్లు చెప్పడంతో ఆయా ప్రాంతాల్లో గాలించారు పోలీసులు. దాంతో.. అటవీ ప్రాంతంలో మూట కట్టి పడేసిన ఓ సంచిని స్వాధీనం చేసుకున్నారు. పాప డెడ్‌బాడీగా గుర్తించి.. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు పోలీసులు.. కాగా.. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాసరగడి గ్రామంలో గోనె సంచిలో బాలిక మృతదేహం లభించినట్లు పోలీసులు తెలిపారు.అదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రభాకర్ కుటుంబంతో సూరారంలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 12న కుమార్తె ఏం.జోష్న (7) కనిపించడం లేదని సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పోలీసులు బాలిక కోసం దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే.. అనుమానంతో తిరుపతిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

## సంపాదకీయం

# వ్యవస్థను పట్టించుకోని వాదం దేనికి?

ప్రకృతి గురించి చైతన్యమై శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకున్నంత మాత్రాన ఆయా వ్యక్తులు ఒక పెద్ద వ్యవస్థాగతమైన జీవితాలను సమూహాలను ప్రభావితం చేయలేరు. పర్మనెంట్ ఉద్యోగులు విపరీతంగా తగ్గిపోయి, కాంట్రాక్టు ఉద్యోగులు విపరీతంగా పెరిగిపోయేటప్పుడు మానవవాదాలు ఈ దోపిడీకి పరిష్కారం ఇవ్వలేవు. ఈ విధానం వెనుక పొంచివున్న ప్రపంచీకరణ సామ్రాజ్యాన్ని, సామ్రాజ్యవాదాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం ఈ వాదం చెయ్యదు. ఎందుకంటే ఈ వాదం ఎప్పుడు కూడా ప్రకృతి దగ్గర ఆరంభమవుతుంది. ప్రకృతి దగ్గర ఆగిపోతుంది. అసాధారణమైన ప్రతిభను చూపిస్తుంది. ఈ వాదాన్ని అలవర్చుకున్న కార్యకర్తలకు ప్రకృతి విషయంలో అసాధారణమైన విజ్ఞానం, చైతన్యం ఉంటుంది. ప్రకృతికి సంబంధించిన విషయంలో, దేవుడికి సంబంధించిన విషయంలో హేతువాదం, మానవవాదం అద్భుతమైన అవగాహన అందిస్తుంది. సమాజానికి అశాస్త్రీయత నుంచి, శాస్త్రీయత వైపుగా తీసుకొనిపోవడానికి ప్రయత్నిస్తుంది. అందులో సందేహం లేదు. అయితే, మనిషి అజ్ఞానంలో ఉండడానికి మనిషి మాత్రమే కారణం కాదు. ప్రకృతి గురించి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకున్నంత మాత్రాన ఆయా వ్యక్తులు సమాజాన్ని అన్ని విధాలా ఆరోగ్యకరంగా మార్చలేరు. వ్యవస్థాగత కారణాలు అనేకం ఉంటాయి. మెడికల్ శాస్త్రం ఎంతగా అభివృద్ధి చెందిందని మనం గర్వపడినా, పెద్ద వైద్యులంతా పట్టణాలు, నగరాల్లోనే ఉంటారు. అక్కడే వీరి వ్యాపారం నడుస్తుంది. వైద్య విద్యలో లక్షలు, కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టిన వైద్యుల నుంచి ఈ స్పందన తప్పదు. మరి గ్రామస్తులు రోగాలు వస్తే మూఢ నమ్మకాలు సహజమే కదా.. వారు షార్ట్ కట్ బాబాలనే ఆశ్రయిస్తారు కదా..! వ్యవస్థాగత విషయాల మీద హేతువాదం, మానవవాదం ధ్యానం ఇవ్వదు. మనుషులంతా మూఢ నమ్మకాలను విడనాడితే, ప్రకృతి మీద సరైన చైతన్యం సంపాదిస్తే వ్యవస్థ దానికదే బాగుపడుతుందని భావిస్తుంది. వీరే ఆ వ్యవస్థను బాగు చేసేస్తారు అని నమ్ముతుంది. అయితే, నేను బాగా ఉంటే ప్రపంచం అంతా బాగుంటుంది అనే తాత్విక సిద్ధాంతం ఎల్లవేళలా విజయం పొందదు. నేను టీచర్‌గా బాగా ఉద్యోగం చేసినా, నేను నా క్లాసులో బోధన బాగా చేసినంత మాత్రాన నా విద్యాసంస్థలో తగ్గిపోతున్న ఉపాధ్యాయులను నేను తీసుకొని రాలేను. ఆయా ఉపాధ్యాయుల పాఠ్యాంశాల బోధనలను నేను బోధించలేను. అలాంటప్పుడు నేను బాగా ఉన్నంత మాత్రాన నా ఆఫీసు, నేను పనిచేసే సంస్థ బాగయిపోదు. సామూహిక కృషి జరగాలి. అందుకు వ్యవస్థాగతమైన పరిష్కారాలు రావాలి. ఇలానే ప్రతి చోట జరగాలి. ఇక్కడ మానవవాదం పనిచేయదు. ఆర్థిక, సామాజిక, సోషలిస్టు చైతన్యం మాత్రమే ఒక విద్యా సంస్థను అయినా, ఒక దేశాన్ని అయినా సరైన దారికి తీసుకొస్తుంది. గనుల పేర్ల మీద అడవులకు అడవులు నరికేసి వేల కొలది ఆదివాసీలను తమ స్థావరాల నుంచి తరిమేసే ప్రపంచీకరణ నేపథ్యంలో ఇలాంటి మానవ వాదాలు ఆయా ప్రజానీకానికి ఏ రకమైన ప్రయోజనాన్ని కూడా, ఏ రకమైన న్యాయాన్ని కూడా ఇవ్వవు. మానవ వాదాలు మరో వెయ్యి సంవత్సరాలు దేశాల్లో ఉన్నా సరే అవి సగటు మనిషికి న్యాయమైన జీవితాన్ని అందించడంలో సఫలం ఎప్పుడూ కావు. ఎందుకంటే అవి మూలం లోకి వెళ్లే ప్రయత్నం చేయవు. మానవ వాదుల మీద నాకు ఎలాంటి వ్యతిరేకత లేదు. కానీ మానవవాదం ప్రపంచం సమస్యలకు పెనాసియా కాదు. ఇది ప్రకృతి దగ్గర మాత్రమే ఆగిపోతుంది. ఒక పెద్ద పరిశ్రమ లోపల యజమాని, కార్మికుడికి మధ్య ఏ రకమైన సంబంధం ఉంటుంది అనే విషయం విశ్లేషించడానికి ప్రయత్నించదు. జీవితాంతం యంత్రం దగ్గర పనిచేసినా కార్మికులు ఎందుకు కష్టల్లోనే ఉంటారో ఈ హేతువాదం, మానవవాదం అర్థం చెయ్యదు. కరోనా కష్టకాలంలో కూడా ప్రజలు ఎందుకు నలిగిపోయారో, కార్పొరేట్లు ఎందుకు మరింత పోగేసుకున్నారో ఈ వాదం పరిశీలించదు. ఈ యజమాని, ఆ కార్మికుడు మానవవాదం నేర్చుకుంటే, ప్రకృతి మీద సరైన చైతన్యం సంపాదించుకుంటే సమస్య పరిష్కారం అవుతుందని మానవవాదం అంటుంది. నమ్ముతుంది. కానీ, అలా సమస్య పరిష్కారం ఎప్పుడూ కాదు. యజమాని యజమానిలానే ఉంటాడు. కార్మికుడిని దోచుకు తినడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాడు. ఆ యజమానికి ప్రకృతి మీద ఎంత చైతన్యం అందించినా సరే తన ఆస్తులు, తన విలాసాలని వదులుకోవడానికి ఎప్పుడు కూడా ప్రయత్నించదు. అలానే గనుల పేర్ల మీద పచ్చని ఆదివాసి ప్రాంతాల భూముల్లోకి యంత్రాలను తోసేసి పచ్చని భూముల్ని స్మశానవాటికలుగా మార్చేసి అక్కడి ప్రజలకు జీవించడమే కష్టం అయిపోయే పరిస్థితులు తీసుకొచ్చే బడా కార్పొరేట్ల మెదడులలో మనం మానవవాదం, నాస్తిక వాదం, ప్రకృతి మీద గొప్ప పరిశీలన ఎంత వేసినా సరే ఆ కార్పొరేట్లు అవకాశాలని వదులుకొని యంత్రాలను విడిచి పెట్టేసి బయటకు రారు. ప్రకృతి మీద చైతన్యం మాత్రమే సంపాదించుకుంటారు. ఇంతకుముందు చేసే మూఢనమ్మకాలతో కూడిన పనులు ఈరోజు చేయరు.. అంతే! వ్యవస్థ అలానే ఉంటుంది. ఈ మానవ వాదాలతో మరో వెయ్యి సంవత్సరాలు కూడా ఆ దోపిడీ అలానే కొనసాగుతుంది. మానవవాదం ప్రకృతి పరిశీలనలో అద్భుతమైన చైతన్యం అందిస్తుంది. ప్రకృతి మీద అద్భుతమైన చైతన్యం సాధించుకున్నంత మాత్రాన యుద్ధాలు ఆగిపోవు. ఆయుధాల పరిశ్రమలు ఆగిపోవు. దోపిడీ ఆగిపోదు. ఒక వ్యక్తి మానవతావాది అయినంత మాత్రాన తనకు ఉన్న అదనపు సొమ్ము ఇతరులకు ఇచ్చెయ్యడు. తన ఆస్తులు పేదలకు పంచడు. ఆ స్థానంలో పెట్టుబడిదారుడు ఉంటే తన ఉద్యోగులకు రోజుకు అయిదు వందల జీతం స్థలంలో మూడు వేలు చెయ్యడు. లేదా వెయ్యి మంది కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చెయ్యడు. వ్యవస్థాగత మార్పులు రావాలి. ప్రకృతి దగ్గర ఉండిపోయిన హేతువాదం, మానవవాదం ఈ మార్పులు తేలేదు. శ్రమ దగ్గర ఏం జరుగుతుంది అనే విషయంలో మానవవాదం సీరియస్‌గా ఆలోచించదు. సోషలిస్టు చైతన్యం మాత్రమే అది సాధ్యం చేస్తుంది. సోషలిజం కూడా మంచి ఉన్నతమైన మానవవాదం. కానీ, సాధారణ హేతువాదం, మానవ వివాదం లాగా ఇది ప్రకృతి శాస్త్రం మీద మాత్రమే నమ్మకం పెట్టుకొని కూర్చోదు. ఆర్థిక పునాదుల్లోకి వెళ్లి పరిశీలిస్తుంది. పరిష్కారాల కోసం ప్రయత్నాలు చేస్తుంది. శ్రామికులకు అనుకూలంగా, రైతులకు అనుకూలంగా వ్యవస్థ మార్పుకి కృషి చేస్తుంది. వ్యక్తిగత విధానాలు కాకుండా, సామూహిక కార్యక్రమాల మీద ధ్యానమిస్తుంది. అవసరమైతే సమ్మెలను నిర్వహిస్తుంది. అందుకోసం ఆలోచిస్తుంది. ఇది నిరంతర ప్రక్రియ ఇది గెలుస్తుంది. అప్పుడప్పుడు ఓడిపోతుంది. మరలా గెలుపు కోసం ప్రయత్నిస్తుంది. ఆర్థిక దోపిడీని తాకని మానవ వాదాలు మనిషికి ప్రకృతి జ్ఞానాన్ని ఇస్తాయే తప్ప సామాజిక సమానత్వాన్ని అందించలేవు. శ్రామికుడికి దోపిడీ నుంచి విముక్తి చేయలేవు.

# ఆలోచించే మెదళ్లను చంపుతున్న చరిత్ర



భారత స్వాతంత్ర సమర కాలములో కేంద్ర శాసనసభ 1926లో బ్రిటిష్ సామ్రాజ పాలకులు కమ్యూనిస్టుల అణిచివేతలపై ప్రభుత్వం ప్రజా భద్రత చట్టాన్ని ప్రవేశపెట్టినప్పుడు స్వాతంత్ర సమరయోధుడు, ఉగ్ర జాతీయవాదిగా పేరుందిన లాలా లజపతిరాయ్ చాలా తీవ్రంగా వ్యతిరేకిస్తూ అన్న మాటలు ఈ సందర్భంలో వాస్తవానికి చాలా దగ్గరగా ఉన్నాయి. "విప్లవోద్యమం ఉంది అంటే ఆ దేశ ప్రభుత్వ విధానంలో ఏదో పెద్ద లోపం ఉంది అన్నమాట. అటువంటిప్పుడే ప్రజలు విప్లవ పద్ధతులకు దిగుతారు. వీరులైన కమ్యూనిస్టు దేశభక్తుల పట్ల వారికి క్షమాబిక్ష కోరడం లేదని ఆ విధంగా కోరినట్లయితే వారిని అవమానించినట్లే అవుతుంది. బోల్షివిజం వల్ల కానీ కమ్యూనిజం వల్ల కానీ మనకేమీ బెడద లేదు. మనకు ముప్పుగా తయారయింది. స్వప్రయోజనా కారులైన పెట్టుబడిదారులు." నేటి భారత పాలకుల కుట్ర మూలాల్లో బ్రిటిష్ సామ్రాజ్య పాలకుల మూలాలు నిక్షిప్తమై ఉన్నాయి అనడానికి 1926లో కేంద్ర శాసనసభలో లాలా లజపతిరాయ్ అణచివేతను వ్యతిరేకిస్తూ అన్న వాక్యాలు ఇందుకు నిదర్శనం. నేటి భారత పాలకుల ఫ్యాసిస్టు పరిపాలనకి అద్దం పడుతున్నాయి. ఈనాడు ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి కారణం అండా సెల్ జైల్లో వారికి ఎలాంటి వైద్య సదుపాయాలు సరైన సమయంలో కల్పించకపోవడమే ఇన్ని రకాల జబ్బులకి కారణం. ఇది భారత నేరపూరిత పాలకుల హత్య. ప్రపంచంలో రెండు అరుదైన సంఘటనలు మన ముందు కనబడుతున్నాయి. ఒకటి: ఇటాలియన్ కమ్యూనిస్టు నాయకుడైన ఆంటోనిగ్రామ్స్‌కి వీబంంశీశ్రీఱఅఱ నియంతృత్వ పరిపాలనలో సుమారు సంవత్సరాలుగా జైలు నిర్బంధంలో అనేక రకాలైన అనారోగ్య సమస్యలు ఏర్పడ్డాయి. భయంకరమైన అనారోగ్యంతో ఉన్న సందర్భంలో వారిని విడుదల చేసినారు. విడుదల చేసిన ఆరు నెలలకి అదే అనారోగ్యంతో చనిపోయారు. అలాగే రెండవది: నేడు మరణించిన ప్రొఫెసర్ సాయిబాబా గారిది. బాంబే హైకోర్టు జస్టిస్ న్యాయం పట్ల, సత్యం పట్ల తమ ఉనికిని కాపాడుకోవడానికి, దేశ ప్రజల ముందు ప్రదర్శించు కోవడానికి ప్రొఫెసర్ సాయిబాబా గారిని ఎంతో నిష్పక్షపాతంగా నిర్దోషిగా తీర్పు చెబుతూ విడుదల చేసింది. ఇది భారతదేశంలో ఉన్న న్యాయవ్యవస్థ యొక్క కుట్రపూరిత ఎత్తుగడ. బూర్జువా శాసనం రెండు వైపుల పదునైనదే అని అంతర్లీనంగా తెలియజేస్తోంది. రాజ్యానికి తెలుసు సాయిబాబా గారు కొన్ని నెలలు మాత్రమే బతుకుతారు అని. ఆ విషయం తెలిసి వారిని నిర్దోషిగా విడుదల చేస్తున్నట్టుగా, ప్రజలకు న్యాయం పట్ల విశ్వాసం కలిగేటట్టుగా, తమ ఉనికిని కాపాడుకోవడానికి చేసినటువంటి కుట్రపూరిత ఎత్తుగడ. సాయిబాబా గారి మరణం భారత పాలకుల హత్య. ప్రపంచంలో జరిగిన నాలుగు హత్యల సంఘటన ఇప్పుడు చారిత్రాత్మక అవసరంగా గుర్తుచేసుకోవాల్సిన విషయం. ప్రపంచం ఉన్నంతవరకు ఈ సంఘటనలు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా ఉంటాయి. మొదటిది: రోమన్ పాలకులు జీసస్ క్రైస్ట్ ను అత్యంత దారుణంగా భయంకరంగా సిలువ శిక్ష తో రాజ్యం చేసిన మొదటి హత్య.. రెండవది : గ్రీకు పాలకులు 70 ఏళ్ల వయోధుడైన సోక్రటీస్ ని "గ్రీకు దేశం లోని యువతలో ప్రశ్నించే తత్వాన్ని ఉద్బోధిస్తున్నాడని, పాలకులను ప్రశ్నిస్తున్నారని దేశంలో అలజడి సృష్టిస్తున్నాడని" సోక్రటీస్ కి మరణశిక్ష విధించి విషమిచ్చి చంపివేశారు. గ్రీక్ పాలకులు కొన్ని శతాబ్దాల తర్వాత సోక్రటీస్ శిక్ష పట్ల పెద్ద తప్పు చేశామని పశ్చాత్తాపం ప్రకటించారు. మూడవది: ఇటాలియన్ ఫాసిస్ట్ నియంత బెనిటో ముసోలిని ఇటాలియన్ కమ్యూనిస్టు నాయకుడు ఆంటోని గ్రాంస్కిని అరెస్టు చేసి జైల్లో నిర్బంధించి "ఈ మెదడుని 20 సంవత్సరాల కాలం పాటు పనిచేయకుండా చేయాలని" న్యాయమూర్తులు ప్రకటించి జైలు నిర్బంధంలో ఉన్నప్పుడు పలు రకాల అనారోగ్య సమస్యలు ఏర్పడ్డాయి. వైద్య చికిత్సలకి అంతుబట్టని వ్యాధులతో ఊపిరి సలపని దశలో గ్రామ్స్కిని విడుదల చేయడం జరిగింది. విడుదల చేసిన ఏడు నెలలకే ఆయన చనిపోయారు. కమ్యూనిస్టు గ్రామ్స్కిని ఇటాలియన్ రాజ్యం హత్య చేసింది. నియంత్ర బెనిటో ముస్సోలిని. నాల్గవది: భారత దేశ పాలకులు ఆదివాసీ హక్కులకై పోరాడుతున్నారని, భారతదేశంలో సోషలిస్టు నిర్మాణానికి కృషి చేస్తున్నారని, ప్రొఫెసర్ సాయిబాబా గారిపై కుట్ర కేసులు బనాయించి జీవిత కారాగార శిక్ష విధించారు. భారత పాలకులు అనారోగ్యానికి గురి చేసి హత్య చేశారు. ప్రపంచంలోనే ఇది నాలుగో హత్య. భారత పాలకులు అత్యంత పకడ్బందీ వ్యూహంతో నాగపూర్ అండా సెల్‌లో నిర్బంధించి పలు రకాల అనారోగ్య సమస్యలకు గురిచేసి చివరి దశలో బాంబే హైకోర్టు చేత నిర్దోషిగా విడుదలకు ఉత్తర్వులు జారీ చేయించారు. 9 సంవత్సరాల శిక్ష కాలంలో విడుదలైన కొన్ని రోజులకి జైల్లో ప్రబలిన అనారోగ్య సమస్యల పట్ల ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ చివరికి హైదరాబాదు లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వైద్య బృందానికి, కుటుంబీకులకి, మిత్రులకి, భారత పీడిత ప్రజల మానవాళికి భరోసా కలిగిస్తూ నేను తిరిగి మళ్లీ ఆరోగ్యంతో మీ ముందు ఉంటాను అని చెబుతూనే మనందరి నుంచి వెళ్లిపోయారు. ప్రపంచ పీడిత మానవళి ఒక విముక్తి పోరాట యోధుడిని, ఒక సోషలిస్టు నిర్మాణ కార్యకర్తని, ఒక రాష్ట్రానికీ, ఒక దేశానికి సంబంధించిన వాడు కాదు.. యావత్ ప్రపంచానికి సంబంధించిన ఒక నూతన మానవుని కోల్పోయింది.

# మానసిక ఆరోగ్యం ప్రాధాన్యత..

'ఆరోగ్యం అంటే పూర్తిగా శారీరక, మానసిక దృఢత్వం. సామాజిక శ్రేయస్సు కలిగి ఉండటం. అంతే కానీ కేవలం వ్యాధి, బలహీనత లేకపోవటం కాదు' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ మొదటి డైరెక్టర్ జనరల్, ప్రఖ్యాత మానసిక శాస్త్రవేత్త, వైద్యుడు జార్జ్ బ్రోక్ చిషోల్మ్ చెప్పారు. నేటి సమాజ పరిస్థితు లకు అద్దం పట్టే వాక్యమిది. చాలా మందికి శారీరక వ్యాధుల కు సంబంధించిన లక్షణాలు, చికిత్సా ఎంపికలు తెలిసినప్ప టికీ, వారి మానసిక ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో తెలియదు.ప్రతి వ్యక్తీ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. తద్వారా పటిష్టమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంచుకోగలుగుతారు. ఇది ఒక అంశమైతే, మానసిక ఆరోగ్యం ప్రధాన మానవ హక్కు. మానవ మనుగడలో, సామాజిక, ఆర్థిక, వ్యక్తిగత అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రపంచ జనాభాలో 60 శాతం మంది ఉద్యోగ రంగంలో ఉన్నారు. ఈ మేరకు ఉద్యోగ ప్రదేశాలలో మానసిక ఆరోగ్య ప్రమాదాలను గుర్తించి, నివారించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ అందరినీ హెచ్చరిస్తోం ది. గత సంవత్సరం, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి "జాతీయ పురోగతి" కోసం యువత వారానికి 70 గంటలు పని చేయాలని సూచించారు. అమెరికాలో టెస్లా వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ మనిషి తన వృత్తిలో విజయవంతం కావడానికి వారానికి 100 గంటలు పని చేయాలని సూచించారు. కానీ దీర్ఘ కాలం విశ్రాంతి లేకుండా పని చేయటం వాస్తవానికి మానసిక, శారీరక ఆరోగ్యానికి ప్రతికూలమైనదని మానసిక శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైంది. దానికి తార్కాణం ఈ మధ్య ఎర్నెస్ట్ యంగ్ కంపెనీలో ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా పని చేస్తున్న 26 ఏళ్ల అన్నా సెబాస్టియన్ పెరైల్ పని ఒత్తిడి వలన మరణించటం దేశమంతా సంచలనం కలిగించింది. అదే విధంగా, మరో సంఘటనలో ఉద్యోగిని బ్యాంకులో పని చేస్తుండగా కుప్పకూలి మృతి చెందిన సంఘటన ఉత్తరప్రదేశ్ లక్నోలో జరిగింది. ఈ సంఘటనపై ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ తన ట్విట్టర్‌లో విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కార్పొరేటు విధానాలతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని విమర్శించారు. పని ఒత్తిడి గురించి ప్రభుత్వాలు, కంపెనీలు తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. నిజానికి మానవ వనరులు కోల్పోవడమనేది పూడ్చలేని లోటు. దీర్ఘకాల పని గంటలు, ఉద్యోగ సంస్థలలో అభద్రతా వాతావరణం, అణచివేత లాంటి కారణాలు ఉద్యో గుల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. వ్యక్తిగ త, జాతీయ అభివృద్ధికి మానసిక ఆరోగ్యం ప్రధానమైన, ప్రభా వవంతమైన చోదక శక్తిగా నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే (ఎన్. ఎం.హెచ్.ఎస్) భావిస్తోంది. ఎన్.ఎం.హెచ్.ఎస్ 2015-16 నివేదిక ప్రకారం, భారతదేశంలో 10.6 శాతం పెద్దలు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. ఇతర రుగ్మతలకు, మానసిక రుగ్మతలకు చికిత్స వ్యత్యాసం 70 శాతం నుండి 92 శాతం మధ్య ఉందని సర్వే పేర్కొంది. గ్రామీణ ప్రాంతాలు (6.9 శాతం), పట్టణేతర మెట్రో ప్రాంతాలు (4.3 శాతం)తో పోలిస్తే పట్టణ మెట్రో ప్రాంతాల్లో (13.5 శాతం) మానసిక రుగ్మతల ప్రాబల్యం ఎక్కువగా ఉంది. ఒత్తిడితో కూడిన జీవన పరిస్థితులు, ఆర్థిక అస్థిరత, ఎదిగే అవకాశాలు లేకపోవడం వల్ల పేదరికం మానసిక ఆరోగ్య ప్రమాదాన్ని ప్రభావితం చేస్తుంది. ఇవి మానసిక క్షోభను పెంచడానికి దోహదం చేస్తాయి. మానసిక ఆరోగ్యం మొత్తం శ్రేయస్సుకి ప్రాథమిక అంశం వంటిది. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం, క్షేత్ర స్థాయిలో మానసిక ఆరోగ్య సంరక్షణలో చేసిన మెరుగుదల లను వేగవంతం చేయడానికి, వాటి ప్రభావాన్ని పెంచడానికి ప్రస్తుత కార్యక్రమంలో అంతరాలను పరిష్కరించడానికి పూనుకోవా లని సర్వే నొక్కి చెప్పింది. విధానపరమైన కొన్ని ముఖ్యమైన సిఫార్సులు కింది విధంగా ఉన్నాయి. ప్రతి లక్ష జనాభాకు 0.75 మంది సైకియాట్రిస్టుల నుంచి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణానికి అనుగుణంగా లక్ష జనాభాకు మానసిక వైద్యుల సంఖ్యను మూడుకు పెంచే ప్రయత్నాలను రెట్టింపు చేయాలి. ఎక్సలెన్స్ సెంటర్ల సేవలతో పాటు మానసిక ఆరోగ్య సంరక్షణ నిపుణులు, యూజర్లు తమ అవసరాలను అర్థం చేసుకోవడానికి సమగ్ర మార్గదర్శకాలను రూపొందించాలి. పీర్ సపోర్ట్ నెట్‌వర్క్‌లు, స్వయం సహాయక బృందాలు, కమ్యూనిటీ ఆధారిత పునరావాస కార్యక్రమాలను పెంపొందించడం మొదలైనవి మానసిక రుగ్మతల కుంగుబా టును తగ్గించడానికి, తమదనే భావనను పెంపొందించడానికి సహాయపడతాయి. నిర్ణయాలు తీసుకోవడం, సేవా ప్రణాళిక లు, సలహా ప్రయత్నా లలో మానసిక ఆరోగ్య సమస్యలతో వ్యక్తిగత అనుభవం ఉన్న వారిని భాగస్వాములను చేయడం ద్వారా మానసిక ఆరోగ్య సేవల వ్యక్తి-కేంద్రీకృత, రికవరీ ఓరియెంటేషన్‌ను మెరుగు పరచవచ్చు. మానసిక ఆరోగ్యం, పని దగ్గర సంబంధం కలిగి ఉండటం వలన సహాయక పని వాతావరణం మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ప్రయోజనం, స్థిరత్వాన్ని అందిస్తుంది. మానసిక అనారోగ్యంతో వున్న వారికి సరైన మద్దతు లేకపోవడం వలన వారి ఆత్మవిశ్వాసం, పనిలో ఆనందం, పని సామర్థ్యం, ఉపాధి పొందే సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. పేలవమైన మానసిక ఆరోగ్యం, కుంగుబాటు, ఆందోళన అనేవి పని తీరు తగ్గడానికి, పనికి దూరంగా ఉంటానికి కారణమౌతాయి. సిబ్బంది టర్నోవర్‌పై ప్రభావం వేస్తాయి. కార్యాలయంలో ఉద్యోగుల మానసిక ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవటం, అవగాహన కార్యక్రమాలు రూపొందించటం, సహేతుకమైన వసతిని, సాధారణ సహాయక సమావేశాలను నిర్వహించటం, తరచుగా విరామాలను షెడ్యూల్ చేయడం, లాంటి చర్యలు యాజమాన్యం తీసుకోవాలి. కార్యాలయంలోని ఒత్తిడిని గుర్తించి వాటిని పరిష్కరించేందుకు యజమానులు నిర్వాహ కులకు శిక్షణ అందించాలి. శిక్షణ పొందిన నిర్వాహకులు తమ బృందాలకు సమర్థవంతంగా మద్దతు ఇవ్వగలరు. మానసిక ఆరోగ్య ప్రమాదాలను నిరోధించే విధానాలను రూపొందించడానికి, శ్రేయస్సును ప్రోత్సహించడానికి, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతనిచ్చే సహాయక కార్యాల యాలను రూపొందించడానికి ప్రభుత్వాలు, యజమానులు, ప్రతినిధి సంస్థలు కలిసి పని చేయాలి. ప్రతి ఉద్యోగి తామ స్వంత శ్రేయస్సుకు మద్దతు ఇవ్వడానికి చర్యలు తీసుకోవచ్చు. ఒత్తిడిని నిర్వహించడానికి, మానసిక ఆరోగ్యంలో మార్పులను గుర్తుంచుకోవడానికి పద్ధతులను నేర్చుకోవాలి. విశ్వసనీయ స్నేహితుడు, అవసరమైతే కుటుంబ సభ్యుడు, సహోద్యోగి, సూపర్‌వైజర్, ఆరోగ్య నిపుణుల నుండి మద్దతు కోసం సంప్రదించాలి. పని ప్రదేశం ఎప్పుడు నిశ్శబ్దాన్ని ఛేదించి, ఉద్యోగులకు మద్దతు ఇచ్చే పవిత్ర క్షేత్రం అవుతుందో, మానసిక ఆరోగ్యం గురించి సంభాషణలు జరుగుతాయో, అప్పుడు ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్య వారు నినదించిన "పని ప్రదేశంలో మానసిక ఆరోగ్య ప్రాధాన్యత" సందేశానికి సార్థకత చేకూరుతుంది.

## అభాగ్య భారతం ఆకలి తీరేదెపుడు?

పేదరికం ఓ బహువ్యాధి లక్షణంగా మారి ప్రపంచ మానవాళిని పట్టి పీడిస్తున్నది. పేదరికం ఒక ఆర్థిక సమస్య మాత్రమే కాదు, అది ఒక బహుముఖీన సమస్యలతో కూడిన విషవలయం. పేదరికంతో నిరక్షరాస్యత, మానవ హక్కుల ఉల్లంఘన, హింస, దోపిడీల, దొంగతనాలు, అసాంఘీక కార్యకలాపాలు, జీవన ప్రమాణాలు, అసురక్షిత గృహవసతులు, పోషకాహార లోపం, ఆరోగ్య అభద్రత, ఆకలిచావులు వంటివి ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా 1990 విశ్వజనాభాలో 36 శాతం దారిద్ర్యరేఖ దిగువన ఉండగా, 2018 గణాంకాల ప్రకారం 8 శాతం మాత్రమే ఉన్నారని తేలింది. దక్షిణ ఆసియా, సబ్-సహారా ఆఫ్రికావాసులు అధిక శాతం పేదరికం అనుభవిస్తున్నారని అంచనా. విశ్వవ్యాప్తంగా 55 శాతం జనాభాకు కనీసం ఒక సామాజిక రక్షణతో కూడిన ఆర్థిక చేయూతకు దూరంగా ఉన్నారని తేలింది. 1987లో జోసఫ్ వ్రెసిన్స్కి చొరవతో ఫ్రాన్స్, పారిస్ నగరంలో పేదరికం, ఆకలి చావులు, హింస, ప్రాణభయం బారినపడిన ప్రపంచ పౌరుల సమస్యలను చర్చించేందుకు ఒక లక్ష మందితో సమావేశం ఏర్పాటు చేయడం, 1992లో ఈ తీవ్ర సమస్యలకు స్పందించిన ఐక్యరాజ్యసమితి 17 అక్టోబర్ రోజున ప్రతి ఏటా "అంతర్జాతీయ పేదరిక నిర్మూలణ దినం" పాటించాలని నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం-2024 థీమ్‌గా "శాంతియుత సమ్మిళిత అభివృద్ధికి సామీజిక, వ్యవస్థీకృత దిర్వినియోగాలకు అంతం పలుకుదాం" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పించుట జరుగుతున్నది. పేదల దుస్థితిని సహానుభూతితో ఆకలింపు చేసుకొని, పేదరిక నిర్మూలనకు సదాలోచనలు, క్షేత్రస్థాయి ఆచరణలు చేయడానికి ఈ రోజును పాటించాలని సూచిస్తున్నారు. ఆర్థిక అసమానతలను తగ్గించడం, పేదల బడుగు బలహీన వర్గాల సుస్థిరాభివృద్ధికి కృషి చేయడం ప్రభుత్వాల కనీస భాద్యత అవుతుంది. 2015లో ఐరాస రూపొందించిన 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030' ప్రకారం 2030 నాటికి పేదరికం, ఆకలి లేని ప్రపంచం అవతరించే దిశలో కార్యక్రమాలు రూపొందించాలని మార్గనిర్దేశనం చేస్తున్నారు.

# సన్న వడ్లకు రూ.500 బోనస్..

**ఐకెపి సెంటర్లలో ప్రతి గింజ కొంటాం..**
**ధర్నాలు రాస్తారోకోలు లేకుండానే రైతులకు బోనసులు..సరసమైన ధరలు..**
**కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కొరకు అహర్నిశలు పాటుపడుతుంది..**
**మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**





**రామాయంపేట,అక్టోబర్16(సూర్యరేఖ)** కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు లేకుండా సరైన ప్రభుత్వ రేటును సన్న వడ్లకు రూ.500 బోనస్ ను ఇవ్వడం జరుగుతుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు.ఆయన రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ...గత ప్రభుత్వాలలో రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేసి రేటును రాబట్టుకోవడానికి అష్ట కష్టాలు పడుతుండేవారని ఆయన అన్నారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బందులు,కష్టాలు కలిగించకుండా వారి మనోభావాలకు అనుకూలంగానే రేట్లు నిర్వహించడం జరిగిందన్నారు.దొడ్డుబడ్లకు రూ.2300 రేటును సన్నబడ్లకు రూ.500 ఎక్కువగా బోనస్ చెల్లించి తీసుకోవడం జరుగుతుందన్నారు.రైతుల సౌకర్యమే సౌఖ్యమే కాంగ్రెస్ ప్రభుత్వానికి అభిమతమని ఎమ్మెల్యే తెలిపారు.మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...రైతులు ధాన్యాన్ని ప్రతి ఒక్కరు ఐకెపి సెంటర్కు తీసుకురావాల్సిన అవసరం ఉందని,ఇంకా పక్షం రోజుల్లో పంటలు కోతకు వచ్చి సమయం ఉన్నందున ముందుగా వేసుకున్న రైతుల ధాన్యము తయారుగా ఉండడంతో ఐకెపి సెంటర్లను ప్రారంభించడం జరిగిందన్నారు.మొత్తం జిల్లాలో 400 పైగా ఐకెపి సెంటర్లను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.రైతులు మంచి ధాన్యాన్ని తీసుకువచ్చి సరైన ధరను పొందవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట తహసిల్దార్ రజని కుమారి, చౌదరి సుప్రభాత రావు, దోమకొండ యాదగిరి,కంభంపాటి విప్లవ కుమార్, రమేష్ రెడ్డి,అల్లాడి వెంకటేష్,చింతల సాయిలు, నాగులు,ఎంసెట్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయుల నియామకం..



**నిజాంపేట,అక్టోబర్16(సూర్యరేఖ)**మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం డీఎస్సీ 2024 కు సంబంధించిన నూతనంగా ముగ్గురు ఉపాధ్యాయులు పాఠశాలకు నియమించినట్లు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు అరుణ అన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గత ఏడు సంవత్సరాలుగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం, ఉపాధ్యాయుల కోరత ఉన్నందున పాఠశాలకు నూతనంగా ఉపాధ్యాయులను నియమించినందుకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్,ఎంఈఓ డిఈఓ లకు కృతజ్ఞతలు తెలిపారు.పాఠశాలలో విద్యార్థులకు చక్కటి విద్య బోధన అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నరేష్, శ్రీలత, బాజా రాజేందర్, నేరోళ్ల శ్రీనివాస్,జెల్ల శ్రీకాంత్ గౌడ్,బాలమణి,తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి





**బెల్లంపల్లిలో రూ.14 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం..**

**బెల్లంపల్లి,అక్టోబర్16 (సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మున్సిపల్ ఛైర్పర్సన్ శ్వేత అన్నారు. బెల్లంపల్లి పట్టణంలో రూ.14 లక్షల వ్యయంతో 10,11,20,28వ వార్డులలో అభివృద్ధి పనులకు మున్సిపల్ ఛైర్పర్సన్ శ్వేత, కమిషనర్ శ్రీనివాస్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ మాట్లాడుతూ...ఎమ్మెల్యే సహకారం తో రానున్న రోజుల్లో ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే సహకారంతో బెల్లంపల్లి ఎంతో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. ప్రతి వార్డులో ఏలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్, అధికారులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి..



**నిజాంపేట,అక్టోబర్16(సూర్యరేఖ)** మండల పరిధిలోని చల్మెడ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యువత ఆన్ లైన్ మోసాలకు గురవుతున్నారని సెల్ ఫోన్లపై దృష్టి సారించకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. యువత మత్తుకు బానిసలు కావద్దని రాబోయే తరానికి యువత ఎంతో ఆదర్శమని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలపై అవగాహన కల్పించి వాళ్ళు పోస్టర్లను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సునీత,కానిస్టేబుల్ నాగరాజు, ఉపాధ్యాయులు రామ్మోహన్ శర్మ,తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాముల మహా పాదయాత్ర..



**రాజేంద్రనగర్,అక్టోబర్ 16** అయ్యప్ప స్వాములు శబరిమలకు మహా పాదయాత్రగా బయలుదేరారు.శబరిమల మహా పాదయాత్రలో భాగంగా అయ్యప్ప స్వాములు బక్క అనిల్ రెడ్డి,దాసరి జగదీష్ యాదవ్ షాద్ నగర్ కు చేరుకున్నారు.స్వాములకు రాజేంద్ర నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుధవారం దేవేందర్ గౌడ్ కలిసి స్వాగతం పలికారు.ఈ పాదయాత్రలో స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటూ దాదాపు ఈ యాత్ర 42 రోజులు సాగనుందని వారు తెలిపారు.

## రాజేంద్రనగర్ దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేసిన

**శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెంద్యాల సాయి మల్లిక్**



**రాజేంద్రనగర్,అక్టోబర్ 16** రాజేంద్రనగర్ దర్గాలో అఖిల్ గర్వి షరీఫ్ కార్యక్రమానికి శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెంద్యాల సాయి మల్లిక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్గా వద్ద ఆయన ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ఈ సందర్భంగా పెంద్యాల సాయి మల్లిక్ మాట్లాడుతూ...కులాలకతీతంగా ప్రతిఒక్కరూ దర్గాను దర్శించుకొని ప్రార్ధనలు చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని సంతోషంగా జీవించాలన్నారు.

# తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు రక్తదాన శిబిరం

**మెగా రక్తదాన శిబిరానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీకి ఆహ్వానం..**
**ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు**



**కామారెడ్డి,అక్టోబర్ 16(సూర్యరేఖ)** తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కర్షక్ బి.ఎడ్ కళాశాలలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మెగా రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ హాజరవుతున్నారని వెల్లడించారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ...తలసేమియా వ్యాధి తో బాధపడుతున్న చిన్నారులకు రక్తం దొరకకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులకు గురి అవుతున్నారని,వారి ఇబ్బందుల ను తొలగించడానికి ఈ మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించ డం జరుగుతుందని తెలిపారు. యువత రక్తదానానికి ముందు కు రావాలని,రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంస పత్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. రక్తదానం చేయాలనుకున్నవారు 9492874006 నెంబర్ కి సంప్రదించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తలసేమియా సికిల్ సెల్ సొసైటీ నిర్వాహకులు కోటపాటి రత్నావళి, కామారెడ్డి రక్తదాతల సమూహ ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్,కామారెడ్డి జిల్లా రైస్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పప్పుల రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాల సమస్యను పరిష్కరించాలని ఏఈని కోరిన

**మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ**



**రాజేంద్రనగర్,అక్టోబర్ 16** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ అన్నారు.బుధవారం పలు బస్తీలలో ఎలక్ట్రికల్ ట్రాన్స్ ఫారాలు,పోల్స్,కరెంటు తీగల గురించి బీఆర్ఎస్ నాయకులు ఏఈ సుధాకర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వివిధ బస్తీలలో సమస్యలపై వివరించారు.ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ కురుమ మాట్లాడుతూ...ముప్పై సంవత్సరాల కు ముందు వేసిన స్తంభాలు శిథిలావస్థకు చేరి గాలి,వాన వచ్చినా ప్రమాదకరంగా పడిపోయే విధంగా ఉన్న స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు.అదే విధంగా ఎప్పుడు పడితే అప్పుడు కరెంటు తీగ తెగి ఇళ్ల పైన పడటం జరుగుతుందని,కొన్ని సంవత్సరాల క్రితం వేసిన తీగలను మార్చాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.రోడ్డు మధ్యలో స్తంభాలు ఉండి రావడానికి,పోవడానికి ఇబ్బందికరంగా మారడంతో ఆ స్థంభాలను రోడ్డు మధ్యలో నుంచి ఒక వైపుకు మార్చాలని అన్నారు.అదే విధంగా బస్తీ ఏర్పడక ముందు ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అవి ఇప్పుడు ఇళ్ల మధ్యలోనే ప్రమాదకరంగా ఉన్నాయని,వాటిని బస్తీ చివరిలో నిర్మానుష్య ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు.ఈ మేరకు ఏఈ సానుకూలంగా స్పందించి త్వరలోనే ప్రమాదకర స్తంభాలను మారుస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సొంత నిధులతో అర్చకునికి డబుల్ బెడ్రూం ఇళ్లు

**అట్టహాసంగా గృహ ప్రవేశ కార్యక్రమం**





**రాజేంద్రనగర్,అక్టోబర్ 16 (సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్గౌడ్ తన తల్లిదండ్రులు తోల్కంటి లక్ష్మమ్మ,తోల్కంటి గండయ్యల జ్ఞాపకార్థం అత్తాపూర్ గ్రామ శివాలయంలోని ఆవరణ లో దేవాలయ అర్చకునికి ఎమ్మెల్యే తన సొంత నిధుల తో నూతనంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారు. బుధవారం గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నాయకులు కె.మోహన్రెడ్డి, బి.శ్రీనివాస్రెడ్డి,మిద్దెల సురేందర్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే టి.ప్రకాష్గౌడ్ హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...తన తల్లిదండ్రుల పేరు మీద దేవాలయ అర్చకునికి డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వడం సంతోషంగా ఉందని వివరించారు.తన తల్లిదండ్రుల పేరు మీద మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందు కు కృషి చేస్తానని వివరించారు.తనకు జన్మనిచ్చి ఇంతటి ప్రయోజకున్ని చేసిన తన తల్లిదండ్రులకు తాను ఎల్లప్పుడు రుణపడి ఉంటానని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వనం శ్రీరాంరెడ్డి, మిద్దెల సురేష్ రెడ్డి, చెరుకు అమరేందర్, ప్రవీణ్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి,సత్తిరెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదు..





**అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం..**
**రాజేంద్రనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి**

**రాజేంద్రనగర్,అక్టోబర్ 16** ఎన్ని ఆటంకాలు ఎదురైనా అభివృద్ధి చేయడంలో రాజీ పడేది లేదని రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.బుధవారం డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్ లో రూ.40 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను తోకల శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ...మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.డివిజన్ పరిధిలో అవసరమైన చోట తప్పకుండా రోడ్డు వేయడం జరుగుతుందని వివరించారు. డివిజన్ పరిధిలోని జరుగుతున్న అభివృద్ధి పనులలో ఎక్కడ నాణ్యతకు తగ్గకుండా జాప్యం లేకుండా పనులు నిర్వహించ డం జరుగుతుందన్నారు.ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలిపారు.అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని,లేకపోతే సంబంధిత ఇంజినీర్లదే బాధ్యతని స్పష్టంచేశారు.పెండింగ్ పనులను పూర్తిచేయాలని సూచించారు.ఈ మేరకు కాంట్రాక్టర్ కు, సర్కిల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేశామని వివరించారు.అభివృద్ధి పనులలో నాణ్యత కొరవడితే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏఈ నరసింహమూర్తి,వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, వి.రమేష్, చందు, సూర్యనారాయణ,చింటూ రెడ్డి,కృష్ణ,లక్ష్మణ్, పాండు, భాస్కర్, ధనుంజయ్,సురేష్,శామ్,జాంగీర్, పాడురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేశ హితం కోసం పని చేసే పార్టీ బిజెపి

**రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేలా సభ్యత్వ నమోదు..**
**బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి..**
**ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్**



**రాజేంద్రనగర్,అక్టోబర్ 16** క్షేత్ర స్థాయిలో బీజేపీని బలోపేతం చేసే బాధ్యత కార్యకర్తలపై ఉందని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ పిలుపునిచ్చారు.బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్ పహాడ్ బస్తీలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సభ్యత్వం చేయించారు.ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీని బలోపేతం చేస్తేనే రాబోయే ఎన్నికల్లో పూర్తి స్థాయిలో మెజార్టీ సీట్లు సాధించుకునే అవకాశాలున్నాయన్నారు.కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీయేనని చెప్పారు. రాష్ట్రంలో అధికారంలోకి తీసుకువచ్చేలా బిజెపి సభ్యత్వ నమోదు ప్రక్రియను రెండు విడతలుగా చేపడతామన్నారు.పోలింగ్ బూత్ కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ మరోసారి సభ్యత్వం తీసుకోవాలని సూచించారు.తెలంగాణలో వ్యక్తులకోసం కాకుండా..స్వచ్ఛమైన నీతివంతమైన పాలన సాగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ ఉన్నారు. ప్రపంచ చిత్రపటం మీద భారతదేశ ఔన్నత్యాన్ని సగౌరవంగా నిలబెట్టిన బిడ్డ ప్రధాని నరేంద్ర మోదీ అని పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో ఇంకా అనేక మంది చేరికలతో బిజెపి పటిష్టంగా తయారు కాబోతుంది జోస్యం చెప్పారు.పార్టీ ఎదుగుదల కోసం సమిష్టిగా కృషి చేయాలన్నారు. బీజేపీ లక్ష్యం పెట్టుకున్న 50 లక్షల సభ్యత్వం కావాలంటే ప్రతి ఇంటికి వెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో జోగి రవి,వి.శ్రీనివాస్, శీలం తిరుపతిరెడ్డి,కొమురయ్య,సూరెడ్డి వినయ్ రెడ్డి, ఆడకే మహేందర్,ఎ.రాజు,రామారావు,రాములు యాదవ్,చరణ్, రాఘవేంద్ర రెడ్డి,వినయ్,బాబుజీ తదితరులు పాల్గొన్నారు.


# ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చేయాలి

**ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దొంతగోని శివకృష్ణ**



**ఇబ్రహీంపట్నం,అక్టోబర్ 16(సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్మెంట్,స్కాలర్షిప్లని విడుదల చేయాలని ఏబీవీపీ వీరపట్నం జిల్లా కన్వీనర్ దొంతగోనిశివ కృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సంవత్సరాల తరబడి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయని, కారణంగా దాదాపు రూ.7.500 కోట్లకు పైగా పెండింగ్ లో ఉన్నాయని,నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావొస్తున్న పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యల చేస్తూ పేద విద్యార్థుల జీవితాల పట్ల శాపంగా మారారని మండిపడ్డారు. పేద విద్యార్థులకు సంజీవని వంటి ఫీజు రియంబన్మెంట్,స్కాలర్షిప్ పథకానికి తూట్లు పొడుస్తూ విద్యార్థుల హక్కు అయినటువంటి ఫీజు రియంబర్స్మెంట్ లను విడుదల చేయకపోవడం అనేది పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే దిశగా ప్రభుత్వం కుట్ర చేస్తుంది అన్నారు.డిగ్రీ,పీజీ ఇంజనీరింగ్ పూర్తిచేసిన వేలమంది విద్యార్థులకు ఫీజు రియంబర్మెంట్ స్కాలర్షిప్ రాని కారణంగా యాజమాన్యాలు ఫీజు రియంబర్మెంట్ వస్తే కానీ సర్టిఫికెల్స్ ఇవ్వమంటూ విద్యార్థలను ఒత్తిడికి గురి చేస్తున్ని ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఒకవైపు రియంబర్మెంటు బకాయిలు చెల్లిస్తే తప్ప మేము కళాశాలలో నడవలేని స్థితిలో ఉన్నామని,ప్రైవేటు యాజమాన్యాలు మొద పెట్టుకుంటున్నారని,ఫీజు రియంబర్స్మెంట్ పైన ఆధారపడి నడిపిస్తున్న కళాశాలలు వందల సంఖ్యలో ఉన్నాయని తెలిపారు.మధ్యలోనే కళాశాల యాజమాన్యాలు చేతులెత్తే పరిస్థితి కనిపిస్తుందన్నారు.ఇటు యాజమాన్యానికి అటు ప్రభుత్వానికి మధ్యలో బలవుతున్నది విద్యార్థులేనని ఆవేదన వ్యక్తం చేశారు.డిగ్రీ,పీజీ, ఇంజనీరింగ్ పూర్తి అయిన తర్వాత కూడా సర్టిఫికెట్స్ రాక ఒకవైపు ఉన్నత విద్యకు మరొకవైపు ఉద్యోగ అవకాశాలు వచ్చినా కూడా సర్టిఫికల్స్ లేని కారణంగా విద్యార్థుల జీవితాలు అంధకారంలోకి నెట్టి వేయబడుతున్నాయన్నారు.ప్రభుత్వాలు మారుతున్న విద్యు వ్యవస్థ తీరు మారరంలేదని, విద్యార్థుల జీవితాలు బాగుపడటం లేదన్నారు. విద్యాలయాలను విద్యావ్యవస్థను పటిష్ట పర్చాల్సిన ప్రభుత్వమే విద్యను అంధకారంలోకి నెట్టి వేస్తూ నూతనంగా ఇంటర్నేషనల్ రూల్స్ అంటూ యూనివర్సిటీలు అంటూ కొత్త హామీలతో చేతులు దులుపుకుంటుందే తప్ప ఇచ్చిన హామీలు మాత్రం అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వానికి విద్యారంగం పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏంటో విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ లోనే అవగతం అయిందన్నారు.సంవత్సరాల తరబడి అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్న అనేక కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదన్నారు.ప్రభుత్వం ఇచ్చేటటువంటి ఫీజు రియంబర్మెంట్ స్కాలర్షిప్స్ విద్యార్థుల హక్కు అని జ్ఞప్తికి తెర్చుకొని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందన్నారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ఏబీవీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## రాయలపూర్ వాసికి వ్యవసాయ శాఖలో ఉద్యోగం..



**రామాయంపేట,అక్టోబర్16(సూర్యరేఖ)** రామయంపేట మండలం రాయల పూర్ గ్రామానికి చెందిన వడ్ల పవన్ కుమార్ వ్యవసాయ శాఖలో మండల వ్యవసాయ అధికారిగా ప్రభుత్వ ఉద్యోగం పొందడం జరిగింది.ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 148 మంది మండల వ్యవసాయ అధికారులను నియమించింది అందులో భాగంగా రాయిలాపూర్ గ్రామానికి చెందిన వడ్ల పవన్ కుమార్ మండల వ్యవసాయ అధికారిగా మాచారెడ్డి మండలం కామారెడ్డి జిల్లాలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు.


## రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరుగా దుర్గాప్రసాద్



**రాజేంద్రనగర్,అక్టోబర్ 16** రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ గా ఎం.దుర్గాప్రసాద్ నియమితులయ్యారు.ఈ మేరకు టీజీఎస్పీడీసీఎల్ సిఎండి నియామక ఉత్తర్వులు జారీ చేశారు.బుధవారం రాజేంద్రనగర్ ఫిష్ బిల్డింగ్ వద్ద గల కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు.దుర్గాప్రసాద్ సంస్థలో సబ్ ఇంజనీర్ గా పనిచేస్తూ అసిస్టెంట్ ఇంజనీర్ గా పదోన్నతి పొందారు.ఇంతకుముందు ఇబ్రహీంబాగ్ విద్యుత్ డివిజన్ కార్యాలయంలో పనిచేశారు.పదవి బాధ్యతలు స్వీకరించిన దుర్గాప్రసాద్ కు సిబ్బంది, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

## కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ..

**గౌడ కులస్తులకు ఉపాధి కల్పన కోసం ఈత చెట్ల పెంపకం..**




**ఇబ్రహీంపట్నం,అక్టోబర్16(సూర్యరేఖ)**తాటి చెట్లపై నుంచి కల్లు తీసే గౌడకార్మికుల ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షక కవచం కిట్ ఉపయోగపడతాయని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. బీసీ సంక్షేమశాఖ అబ్కారిశాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కాటమయ్య రక్షణ కవచం పంపిణిలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డితో పాటు తుర్కయంజాల్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి చందు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఈత చెట్లు,తాడి చెట్లు జీవనాధారంగా కొనసాగుతున్న గౌడ సోదరులకు అవసరమైన సహాయం అందించేందుకు కాటమయ్య కిట్లను పంపిణి చేయడం జరుగుతుందని అన్నారు.కుల వృత్తులు చేస్తున్న సమయంలో జారి పడిపోయి ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు రక్షణ కవచంగా నిలిచే కాటమయ్య రక్షణ కవచం కిట్లను అందిస్తున్నామని తెలిపారు. గౌడ కులస్తులకు ఇప్పటికే పెన్షన్ అందిస్తున్నామని, ప్రమాదాలు జరిగితే పరిహారం సైతం అందిస్తున్నామని వెల్లడించారు.అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ భాస్కర్ చారి,ఈసీ శేఖర్ మామ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్,లక్ష్మిపతిగౌడ్, కృష్ణగౌడ్,దాస్ గౌడ్, నియోజకవర్గగౌడ సోదరులు నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## మాసాయిపేట తపస్ నూతన కమిటీ ఏకగ్రీవం..




**మసాయిపెట్,అక్టోబర్16(సూర్యరేఖ)** మెదక్ జిల్లా మాసాయిపేట తపస్ నూతన కమిటీ ఎన్నికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.తపస్ మండల అధ్యక్షులుగా డి.భద్రయ్య (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాసాయిపేట),ప్రధాన కార్యదర్శిగా బి.ఝాన్సీ (ఎంపీపీఎస్ స్టేషన్ మసాయి పెట్ ),ఉప అధ్యక్షులుగా నాగరాజు( యుపిఎస్ చెట్ల తిమ్మాయిపల్లి), కార్యదర్శిగా మహాలక్ష్మి ఎంపీపీఎస్ బొమ్మరం,కోశాధికారిగా మహేష్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొప్పుల పల్లి)ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తపస్ నాయకుడు రంగారెడ్డి తెలిపారు.

## అక్రమ సంబంధానికి చిన్నారి బలి

**కుత్బుల్లాపూర్ :** ఓ వివాహిత మీద కన్నేసిన దుర్మార్గుడు తనకు అడొస్తుందనే ఉద్దేశంతో ఏడేళ్ల బాలికను కిరాత కంగా హతమార్చాడు. హైదరాబాద్లోని సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో దసరా రోజు జరిగిన ఈ దారుణం చోటు చేసుకుంది. ఆదిలా బాద్ జిల్లా బేల మండలం పాటగూడ గ్రామానికి చెందిన మిశ్రమ్ ప్రభాకర్ (40) ఏడు నెలల క్రితం హైదరాబాద్ వచ్చాడు. కూలి పనులు చేసుకునే అతను, పాటగూడ గ్రామానికే చెందిన ఇద్దరు కుమార్తె లున్న మహిళతో కలిసి కుత్బుల్లాపూర్ పరిధి సూరారం జీవన్ జ్యోతినగర్ లో ఉంటున్నాడు. ఆమె పెద్ద కుమార్తెకు ఏడేళ్లు. ప్రభాకర్ కు తన ప్రాంతానికే చెందిన తిరుపతితో పరిచయం ఏర్పడింది. ప్రభాకర్ ఇంట్లో తరచూ ఇద్దరూ మద్యం తాగేవారు. ఆ క్రమంలో మహిళపై కన్నేసిన తిరుపతి.. ప్రభాక ర్ తోపాటు ఇద్దరు పిల్లల అడ్డు తొలగించుకుంటే ఆమెను సొంతం చేసుకోవచ్చని పథకం వేశాడని తెలిపారు పోలీసులు. ఈ క్రమంలో ఈ నెల 12న ఉదయం ఆమె పెద్ద కుమార్తెను ద్విచక్ర వాహనంలో తన ఇంటికి తీసు కెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి తీసుకొచ్చి వది లేశాడు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**కేశ్లాపూర్ లో విగ్రహావిష్కరణ..**
**సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు**





**బెల్లంపల్లి,అక్టోబర్16(సూర్యరేఖ)** దేశాన్ని ఒకే తాటిపై నడిపించే రాజ్యాంగాన్ని రచించిన డా.బీఆర్ అంబేద్కర్‌ను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ రావు అన్నారు.భీమినీ మండలం కేస్లాపూర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రావిష్కరణ చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి బౌద్ధ ధర్మ ఆచారం ప్రకారం పూజ నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ రావు మాట్లాడుతూ...అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదే శానికి రాజ్యాంగం రచించి, దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వంతో పాటు పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు అంబేద్కర్ కృషి చేశారన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తెలిపారు.అంబేద్కర్ ఈ దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించారని,దాని వల్లనే అందరికీ హక్కులు కల్పించబడ్డాయన్నారు.ఆయన ఆశయ సాధనకు బిజెపి కృషి చేస్తున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్య వర్గ సభ్యులు కొయ్యల ఏమాజి,మాజీ జడ్ పిటిసి గంగమ్మ, మాజీ ఎంపిపి రాజేశ్వరి, బ్రహ్మయ్య,లక్ష్మణ్, యువ నాయకులు దుర్గం సంఘదీప్,జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, అజ్మీరా శ్రీనివాస్, మేక తిరుపతి,సల్లూరి శంకరయ్య, గ్రామస్తులు, మహిళలు,యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## హిందూవులు ఏకం కావాలి

**సికింద్రాబాద్ :** దేవాలయాలపై దాడులు జరిగినప్పుడు అన్ని పార్టీలు అన్ని వర్గాల ప్రజలు స్పందించి అండగా నిలవాలని జనసేన తెలంగాణ అద్యక్షుడు శంకర్ గౌడ్ తెలిపారు. రెండు రోజుల క్రితం దుండగులు దుశ్చర్యకు పాల్పడిన కుమ్మరిగూడ లోని ముత్యాలమ్మ దేవాలయాన్ని శంకర్ జన సేన నేతలతో కలసి సందర్శించారు. మౌన దీక్ష చేస్తున్న స్థానికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అప్పుడే కాకుండా ఇలాంటి పరిస్థితులలో హిందువులంతా ఏకమై బలంగా నిలబడితే ఇలాంటి సంఘటనలు జరగవని అన్నారు. నిందితుడు సలీంను పూర్తిగా విచారించి అతని వెనుక ఎవరి హస్తముందో, ఉగ్ర కోణం ఉన్నదా, లేఖ రాజకీయ కోణం ఉన్నద అనే విషయాన్ని లోతుగా విచారణ జరపాలని కోరారు. దేవాలయాలపై దాడులు జరగకుండా దేశవ్యాప్తంగా ధర్మరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని జనసేన జాతీయస్థాయిలో పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇలాంటి సంఘటనలపై స్పందించి ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# కందుకూరు విద్యుత్ డివిజన్ డిఈగా గోపాలకృష్ణ





**మహేశ్వరం,అక్టోబర్ 16** మహేశ్వరం విద్యుత్ డివిజన్ డిఇగా గోపాలకృష్ణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం కందుకూరులోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఆయన పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు,సిబ్బంది కాంట్రాక్టర్లు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.బదిలీపై వచ్చిన వచ్చి పదవి బాధ్యతలు స్వీకరించిన ఏడి ఈ శంకరు కాంట్రాక్టర్లు వాసుదేవరెడ్డి,ఆసిఫ్,ఉద్యోగులు సన్మానించారు.

# ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలి



**రాజన్న సిరిసిల్ల :** గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై,నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలిఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ అధికారుల,సిబ్బంది పని తీరు భేష్..ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, గ్రామాల్లో విజబుల్ పోలీసింగ్, నేరాల నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట్ సర్కిల్ కార్యాలయం, ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఈరోజు వార్షిక తనిఖీలో భాగంగా ఎల్లారెడ్డిపేట్ సర్కిల్ కార్యాలయం తనిఖీ చేసి సర్కిల్ పరిదిలో నమోదు అవుతున్న గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో సిడి ఫైల్స్, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను పరిశీలించి, కేసులలో నిందితులకు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ శాంతి భద్రతల పరిరక్షణకు ఆయాఎస్సై ల ద్వారా చర్యలు చేపట్టాలని, సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, స్టేషన్ రికార్డ్స్ , వర్టికల్స్ అమలు తీరు,స్టేషన్ లో విధులు నిర్వహించే సిబ్బంది కిట్ ఆర్టికల్స్, పెండింగ్లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సి.డి ఫైల్స్ లను తనిఖీ చేసి స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ. ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని,విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రామాల్లో తరచు పర్యటిస్తూ ప్రజలతో సస్సంబంధాలు కలిగి ఉండాలని, గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం విపివో ల దగ్గర ఉండాలని ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలన్నారు. ఎస్పీ వెంట సిఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్, ట్రైని ఎస్ఐ రాహుల్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు

# పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి



**భూపాలపల్లి:** పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐ డి ఓ సి కార్యాలయపు కాన్ఫరెన్స్ హాల్లో పత్తి కొనుగోలు ప్రక్రియపై మార్కెటింగ్, సహకార, సిసిఐ, పోలీస్,అగ్నిమాపక, వ్యవసాయ కాటన్ మిల్లుల యజమానులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పత్తి కొనుగోలు ఏర్పాట్లకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభం అవుతున్నదని సిసిఐ ద్వారా కొనుగోలు చేయుటకు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నవంబర్ మొదటి వారం నుండి పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని తెలిపారు. జిల్లాలో 93 వేల ఎకరాలలో పత్తి సాగు జరిగిందని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్తి కొనుగోలు సజావుగా, సక్రమంగా సాగేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలో ఐదు పత్తి మిల్లులు ఉన్నాయని రైతులు విక్రయాలు చేసేందుకు దగ్గరలో ఉన్న మిల్లులకు ట్యాగింగ్ చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన పత్తి నిల్వ ఉంచేందుకు గోదాములను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నెల 25 వ తేదీ వరకు పత్తి కొనుగోళ్ళు ప్రారంభించాలని ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనుగోలు జరపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. సీసీఐ ద్వారా మాయిచ్చర్ మిషన్, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని పోలీస్ శాఖకు సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో స్థానిక పోలీస్ అధికారుల నెంబర్లు, అత్యవసర నంబర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. తూనికలు కొలతలు శాఖ ద్వారా ప్రతి కొనుగోలు కేంద్రాలలో కాంటాలకు స్టాంపింగ్ చేయాలని ఆదేశించారు. గోదాములు, మిల్లుల వద్ద అగ్నిపాక శాక ద్వారా అగ్నిప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని అన్నారు.
ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి కనక శేఖర్, ఆదనపు ఎస్పీ బోనాల కిషన్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సందాని, వ్యవసాయశాఖ అధికారి విజయ భాస్కర్,జిన్నింగ్ మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు

## రాబోయే ఎన్నికలలో కలిసికట్టుగా పని చేయాలి..

**కాంగ్రెస్ యువ నాయకుడు మక్సుద్**




**అందోల్,అక్టోబర్16 (సూర్యరేఖ)**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కలిసి కట్టుగా పని చేయాలని కాంగ్రెస్ యువ నాయకుడు మక్సుద్ పిలుపునిచ్చారు. బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో సంగారెడ్డి జిల్లా రాయికోడ మండలం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మైనార్టీ నాయకుడు మక్సుద్ మాట్లాడుతూ. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరూ కూడా పార్టీ ఆదేశాల మేరకు ఎవరికి టికెట్లు కేటాయించిన మండలంలో అత్యధిక సర్పంచులను మరియు జడ్పిటిసి,ఎంపీటీసీలను గెలిపించుకొని సత్తా చాటాలని తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ చేసిన అభివృద్ధి పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి ప్రజలకు అర్థమయ్యే రీతిలో గడపగడపకు సైనికుల వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించాలని మక్షుద్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కార్యకర్తలు అభిమానులు అనుచరులు పాల్గొన్నారు

## పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదలకై శాంతియుత ర్యాలీ నిరసన..




**చెన్నూర్,అక్టోబర్16(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఐక్య విద్యాసంఘాల ఆధ్వర్యంలో ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని కోరుతూ మంచిర్యాల ఐబి చౌరస్తా నుండి బెల్లంపల్లి చౌరస్తా వరకు వేల మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ...ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో సంఘం నాయకులు,ట్రాస్మా నాయకులు మాట్లాడుతూ...మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ప్రైవేట్ డిగ్రీ కళాశాలల చదువుతున్నటువంటి పేద మధ్య బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకుంటున్నారు.గత మూడు సంవత్సరాల నుండి విద్యార్థులకు స్కాలర్షిప్,ఫీజు రీయంబర్స్మెంట్ రాకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి తక్షణమే రేవంత్ ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్మెంట్ విడుదల చేయాలని కోరడం జరిగింది.లేనియెడల విద్యార్థి సంఘాలు,ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో యాజమాన్యాలు తస్మా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ల ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు జిమ్మిడి గోపాల్,సన్నీగౌడ్,జిల్లల శ్రీకాంత్, జాగిరి రాజేష్,రేగుంట క్రాంత్ కుమార్, రాజేంద్రప్రసాద్,వెంకటేష్,తిరుపతి,డిగ్రీ కళాశాల సంఘం రాష్ట్ర నాయకులు నరసయ్య,మల్లయ్య, దారి చంద్రమోహన్ గౌడ్,శ్రీనివాస,రాజ్,పల్లె భూమేష్,ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్,రేగళ్ల ఉపేందర్,తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట్ విద్యుత్ డివిజన్ డిఇగా రామచంద్రయ్య





**సిద్దిపేట,అక్టోబర్ 16 :** సిద్దిపేట విద్యుత్ డివిజన్ డివిజనల్ ఇంజనీర్ గా రామచంద్రయ్య బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు.సిద్దిపేట డివిజన్ డిఈగా పదవి బాధ్యతలు స్వీకరించిన రామచంద్రయ్యను అధికారులు సిబ్బంది ఉద్యోగులు శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ డిఈ (టెక్నికల్)గా పనిచేసి బదిలీ అయిన రామచంద్రయ్యను సర్కిల్ ఎస్ఇ శ్రీరామ్ మోహన్,అధికారులు,ఉద్యోగులు,సిబ్బంది శాలువాతో సత్కరించి వేడుకోలు పలికారు.ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడు తూ సిద్దిపేట డివిజన్లో విద్యుత్ సమస్యలు లేకుండా బాధ్యతాయుతంగా పనిచేస్తానన్నారు.

## యంగ్ ఇండియా స్కూల్‌కు మంత్రి దామోదర రాజనర్సింహ భూమి పూజ

**సంగారెడ్డి :** ఆందోల్ నియోజకవర్గం బస్వపూర్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి మంత్రి దామోదర రాజనర్సింహ భూమియ పూజ చేసారు. మంత్రి మాట్లటాడుతూ తెలంగాణ రావడంలో ఆనాడు కీలక పాత్ర నాదే. సమైక్యాంధ్ర లోనే నేను డిప్యూటీ సీఎంగా ఉన్నాను. అప్పుడూ ఇప్పుడు నేను ఒకేలా ఉన్నాను..ఉంటాను. పదవితో నాకు సంబంధం లేదు...మనిషికి ప్రాంత ప్రీతి ఉండాలి. చేసిన మంచిని ప్రజలు చెప్పుకోరు జనాల్లో ఎంత చేసినా నాకేంటి అనే వైఖరి వచ్చింది. ఆందోల్ లో విద్యాసంస్థలు కావాలని నన్ను ఎవరు అడగలేదు.. అయినా లేని విద్యా సంస్థ అంటూ లేదు. నాడు నియోజకవర్గానికి విద్యాలయాలు తెస్తే నేడు ఆస్పత్రులు తెస్తున్నా. ఎన్నికలు సహజం రాజకీయ నాయకుడు ఏం చేశాడనేది ముఖ్యం. సింగూరు ప్రాజెక్టుని టూరిజం స్పాట్ గా మార్చేందుకు కృషి చేస్తామని అన్నారు.


# నాని - శ్రీకాంత్ ఓదెల చిత్రంలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ.?

దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల – నాని కాంబోలో మరో సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. దసరా పండుగను పురస్కరించుకుని ఈ సినిమా లాంచ్ అవ్వగా.. ఈ సినిమా దసరా సినిమాను మించే స్థాయిలో ఉంటుందని కథ కథానాల్లో ఉహించని ట్విస్ట్‌లు ఉంటాయని నాని తెలిపారు. అయితే ఈ సినిమాలో కథానాయికకు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ మూవీలో హీరోయిన్‌గా 'స్త్రీ 2'తో బ్లాక్ బస్టర్ అందుకున్న శ్రద్ధా కపూర్ నటించబోతున్నట్లు బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ మీడియాలో వార్తలు వైరలవుతున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వవలసి ఉంది. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై 'దసరా' నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తుండగా.. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.



## అప్పటి నుంచే రేసు కారు జోలికిపోవడం లేదు


అక్కినేని నాగార్జున నట వారసుడు అక్కినేని నాగచైతన్య ఇప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో క్రేజీ కథానాయకుల్లో ఒకరు. ప్రస్తుతం ఆయన చందు మొండేటి దర్శకత్వంలో తండేల్ చిత్రంలో నటిస్తున్నాడు. సాయి పల్లవి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ దశలో వుంది. కాగా నాగచైతన్య షూటింగ్స్ లేనప్పుడు ఇంతకు ముందు కార్ బైక్ రేసింగ్స్‌లో పాల్గొనేవాడు. ముఖ్యంగా రేస్ కారులను డ్రైవ్ చేయడం అంటే చైతన్యకు మహా ఇష్టం. అయితే గత కొంతకాలం నుండి ఆయన రేసు కారు జోలికి పోవడం లేదట. ఇటీవల నాగచైతన్య ఓ ఇంటర్వ్యూలో ఆ విషయాన్ని తెలియజేశాడు. "నాకు చిన్నతనం నుంచి రేసింగ్ అంటే చాలా ఇష్టం. కొత్త రకం బైక్ ఏది కనిపించినా వెంటనే డ్రైవ్ చేయాల్సిందే. సినిమాల్లోకి నా ఎంట్రీ ముందు అంటే జోష్ సినిమా కంటే ముందు ఒక స్పోర్ట్స్ కారు తెప్పించాను. ఏ మాత్రం విరామం దొరికినా ఆ కారుపై షికార్లు కొట్టేవాడ్ని. అయితే సినిమాలతో బిజీగా మారిన తరువాత స్లోగా ఆ అలవాటు తగ్గించుకోవాలనుకున్నాను. ఎందుకుంటే రేసు కారు అంటే ఎంతటి స్పీడుతో వెళ్లాల్సి వస్తుందో అందరికి తెలిసిన విషయమే. అంత వేగంతో ట్రావెల్ చేయడం మంచిది కాదు అని నా స్నేహితులు, శ్రేయోభిలాషులు చెప్పడంతో దీనితో పాటు నాపై ఇంతమంది నిర్మాతలు ఇన్వెస్ట్ చేసి సినిమాలు తీస్తున్నారు. నేను ఏ మాత్రం ఏమరుపాటుగా వున్న షూటింగ్‌లకు అంతరాయం జరగడంతో పాటు ఆ పొరపాటు నా వ్యక్తిగత జీవితంపై కూడా పడుతుంది. నిర్మాతలకు కూడా నష్టం వాటిల్లుతుంది. అందుకే రేసు కారు అనే ఆలోచన ఇప్పుడు నాలో రావడం లేదు. ఎప్పుడన్నా ఒకసారి చేసినా.. చాలా జాగ్రత్తగా లిమిట్ స్పీడుతో తగు జాగ్రత్తలు తీసుకోని చేయాలని నిర్ణయించుకున్నా' అని తెలియజేశారు



# సంక్రాంతి రేసు నుంచి తప్పుకోనున్న వెంకీ

టాలీవుడ్ సీనియర్ నటుడు విక్టరీ వెంకటేష్ – అనిల్ రావిపూడి కాంబోలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన ఎఫ్2, ఎఫ్3 చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో వీరిద్దరి కాంబినేషన్‌లో మరో చిత్రం రాబోతుంది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో వస్తున్న ఈ చిత్రం కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానుంది. ఈ చిత్రం ప్రస్తుతం రామోజీ ఫిలిం సిటీలో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సినిమా సంక్రాంతి రేసు నుంచి తప్పుకున్నట్లు తెలుస్తుంది. సంక్రాంతి రేసు నుంచి ఇప్పటికే విశ్వంభర వాయిదా పడిన విషయం తెలిసిందే. తాజాగా ఈ లిస్ట్‌లోకి వెంకీ %–% అనిల్ రావిపూడి ప్రాజెక్ట్ వచ్చినట్లు తెలుస్తుంది. రామ్ చరణ్ నటిస్తున్న గేమ్‌ఛేంజర్ సినిమాను అక్టోబర్ 10న విడుదల చేయనున్నట్లు నిర్మాత దిల్ రాజు ప్రకటించాడు. అయితే ఆయన నిర్మాణంలోనే వస్తున్న మరో చిత్రం వెంకీ అనిల్ రావిపుడి ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్‌ను మొదట సంక్రాంతికి తీసుకువద్దాం అనుకున్నారు. కానీ అదే టైంలో దిల్ రాజు సోంత ప్రోడక్షన్ నుంచి గేమ్ ఛేంజర్ వస్తుంది. దీంతో వెంకీ అనిల్ రావిపుడి సినిమాను వాయిదా వేయబోతున్నట్లు తెలుస్తుంది. ఒకవేళ ఈ సినిమా తప్పుకుంటే అటు గేమ్ ఛేంజర్‌తో పాటు నాగ చైతన్య తండేల్, బాలయ్య ఎన్‌బీకే 109 సినిమాలకు ఇది ప్లస్ అవ్వనుంది. ఈ ప్రాజెక్ట్‌లో కథానాయికలుగా మీనాక్షి చౌదరితో పాటు ఐశ్వర్య రాజేష్ నటించబోతుండగా.. ఈ మూవీలో ఐశ్వర్య రాజేష్ వెంకటేశ్ భార్యగా నటించనున్నట్లు తెలుస్తుంది.







# సస్పెన్స్‌గా విజయ్ ఆంటోనీ గగన మార్గన్ ఫస్ట్ లుక్

నటుడిగా, సంగీత దర్శకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా మల్టీటాలెంటెడ్ స్కిల్స్ ఉన్న టాలెంటెడ్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు విజయ్ ఆంటోని బిచ్చగాడు సినిమాతో ఇండియావైడ్‌గా సూపర్ పాపులారిటీ సంపాదించాడు. ఈ క్రేజీ యాక్టర్ కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా చిత్రం గగన మార్గన్ లియో జాన్ పాల్ డైరెక్ట్ చేస్తున్నాడు. గగన మార్గన్ గ్రిప్పింగ్ థ్రిల్లర్‌గా రాబోతున్నట్టు ఫస్ట్ లుక్‌తో క్లారిటీ ఇచ్చాడు డైరెక్టర్. ముఖంపై గాట్లతో కొంచెం ఆందోళనగా ఉన్నట్టుగా కనిపిస్తున్న లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఈ చిత్రాన్ని విజయ్ ఆంటోనీ ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై మీరా ఆంటోనీ నిర్మిస్తున్నారు. సినిమా సినిమాకు కొత్తదనంతో కూడిన కథాంశాలను ఎంపిక చేసుకుంటాడు విజయ్ ఆంటోనీ. ఇంతకీ బిచ్చగాడు హీరో ఈ సారి ఎలాంటి స్టోరీతో ప్రేక్షకుల ముందుకొస్తున్నాడన్నది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది.

# 'మ్యాజిక్' అంటూ వస్తున్న 'జెర్సీ' దర్శకుడు

'జెర్సీ' లాంటి సినిమాతో డెబ్యూ డైరెక్టర్‌గా బ్లాక్ బస్టర్ అందుకున్నాడు దర్శకుడు గౌతమ్ తిన్ననూరి. ఇక ఇదే సినిమాను బాలీవుడ్‌లో కూడా రీమేక్ చేసి అక్కడ కూడా హిట్ అందుకున్నాడు. అయితే జెర్సీ వచ్చి 5 సంవత్సరాలు అయిన గౌతమ్ నుంచి ఇంకో సినిమా రాలేదు. గత ఏడాది టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండతో గౌతమ్ VD12 అంటూ ఓ ప్రాజెక్ట్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే విజయ్ దేవరకొండతో సినిమా స్టార్ట్ చేసే గ్యాప్‌లో గౌతమ్ తిన్ననూరి ఒక చిన్న సినిమాకు దర్శకత్వం వహించాడు. గౌతమ్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం మ్యాజిక్ సంగీత నేపథ్యంలో వస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే ఫస్ట్ లుక్ విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే తాజాగా ఈ మూవీ నుంచి విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఈ సినిమాను డిసెంబర్ 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. ఇక ఈ సినిమాను సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తుండగా.. కోలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నాడు. ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.





Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI Title -Code :TELTEL 12276 Cell No.9397303326,